teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 87 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 19 జూలై 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## నీట్ పరీక్ష ఫలితాల విడుదలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

### అభ్యర్థుల వివరాల గోప్యతను పాటిస్తూ రిజల్ట్ రిలీజ్ కు సూచనలు




న్యూ ఢిల్లీ, జులై 18 (తీన్మార్ న్యూస్): నీట్ యూజీ 2024 పరీక్ష ఫలితాలను విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అధికారిక వెబ్ సైట్లో నగరాలు, సెంటర్ వారీగా అభ్యర్థుల వివరాలను గోప్యంగా ఉంచి రిజల్ట్ రిలీజ్ తెలిపింది. ఈమేరకు పేపర్ లీక్ కేసుకు సంబంధించిన తీర్పులో జూలై 19 సాయంత్రం 5 గంటలలోపు నీట్ 2024 పరీక్షలో

మిగతా 2 లో



శాసనసభ, మండలి

## సమావేశాలకు నోటిఫికేషన్ జారీ

ఈ నెల 23 నుంచి శాసనసభ, 24 మండలి సమావేశాలు

జులై 25 లేదా 26న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

.. వివరాలు 2లో



## రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మాట మార్చారు

అన్ కండిషనల్ రుణమాఫీకి హామీ ఇచ్చి.. ఈ కండిషన్స్ ఏంటి..?

రుణమాఫీ పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం

.. వివరాలు 2లో

# రెడ్ అలెర్ట్

## రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు

ప్రజలకు "వాతావరణ శాఖ" అలర్ట్ జారీ

సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తు వరకు అల్పపీడనం

పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

మూడు రోజులపాటు పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్



హైదరాబాద్, జులై 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. ఈ మేరకు మూడురోజుల పాటు పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది. పశ్చిమ మధ్య ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఉన్న అల్పపీడనం సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలిపింది. అలాగే, వాయువ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందని రాబోయే రెండుమూడు

మిగతా 2 లో





వీధి కుక్కల దాడి ఘటనపై

# హైకోర్టులో విచారణ

### ఘటనల నివారనకు చర్యలు ఏంటి..?

### ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, జులై 18 (తీన్మార్ న్యూస్): వీధి కుక్కల దాడి ఘటనపై గురువారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. గత కొంతకాలంగా రాష్ట్రంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. కుక్కల దాడి ఘటనల్లో కొంతమంది చిన్నారులు మృత్యువాత పడగా, అనేక మంది తీవ్రగాయాలపాలైన దాఖలాలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం వీధికుక్కల దాడిలో హైదరాబాద్ జవహర్ నగర్ కి చెందిన సంవత్సరంన్నర బాలుడు మృతి చెందిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయింది. దీనిపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వీధి కుక్కల దాడి ఘటనలను నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అడ్వకేట్ జనరల్ సమాధానమిస్తూ జీహెచ్ఎంసి వ్యాప్తంగా 3.79 లక్షల వీధి కుక్కలు ఉన్నాయని, కుక్కల

మిగతా 2 లో

## డీజీపీగారు.. ఈ భాష మీకు అంగీకారయోగ్యమేనా

వైరల్ అవుతున్న కేటీఆర్ చేసిన ట్వీట్

పోలీసుల వ్యవహారశైలిపై డీజీపీకి కేటీఆర్ ప్రశ్నలు

బాధ్యుడైన అధికారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నాం : తెలంగాణ పోలీస్



తెలంగాణ బ్యూరో, జులై 18 (తీన్మార్ న్యూస్)::డీజీపీగారు.. ఈ భాష మీకు అంగీకారయోగ్యమేనా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్ వైరల్ అయింది. పోలీసుల వ్యవహారశైలిపై డీజీపీని బీ కేటీఆర్ ప్రశ్నించారు. వినరాని భాషలో సాధారణ పౌరుడలపై పోలీస్ సిబ్బంది విరుచుకుపడుతున్నారని మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు గండి మైసమ్మ ఆలయం సమీపంలో ట్రాఫిక్

మిగతా 2 లో




## అన్నదాతలకు "సైబర్" అలర్ట్

రైతులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు ఏపీకే లింక్తో మోసాలు

వాట్సాప్ ద్వారా ఏపీకే లింక్స్ పంపిస్తూ నగదు దోపిడి

తెలంగాణ బ్యూరో, జులై 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రైతుల ఖాతాలకు రుణమాఫీ సొమ్ము జమ చేస్తోన్న వేళ సైబర్ నేరగాళ్లు మరో కొత్త ఎత్తుగడతో మోసాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో

మిగతా 2 లో



వారసత్వ అర్చకత్వాన్ని

## పునరుద్ధరించాలి

తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన సీఎస్ రంగరాజన్

అర్చకుల సమస్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టికి వినతులు

హైదరాబాద్, జులై 18 (తీన్మార్ న్యూస్): వారసత్వ అర్చకత్వాన్ని పునరుద్ధరించాలని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. వంశ పారంపర్యంగా


మిగతా 2 లో




## హరీష్ రావు "రుణమాఫీ" ఛాలెంజ్‌పై కాంగ్రెస్ హడావుడి

హామీలన్నీ నెరవేరిస్తే రాజీనామా చేస్తా : హరీష్ రావు

పదవి పోయినా ప్రజలకు న్యాయం జరిగితే అదే సంతోషం



హైదరాబాద్, జులై 18 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చెప్పినట్లుగానే చేస్తే తాను రాజీనామా చేస్తానన్న సంచలన ప్రకటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు స్పందించారు. ఆగస్ట్ 15లోపు రైతు రుణమాఫీ హామీని అమలు చేస్తే రాజీనామా చేస్తానని ఛాలెంజ్‌పై సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ హడావుడి చేస్తోంది. దీనిపై హరీష్ ఓ ప్రకటన

మిగతా 2 లో



## గ్రూప్ 1, 2 అభ్యర్థులతో సానుకూల దిశగా చర్చలు

పరీక్షలు వాయిదా డిమాండ్ ప్రధాన ఎజెండాగా చర్చ

గ్రూప్స్ పరీక్షలు వాయిదా ప్రకటన వచ్చే అవకాశం

హైదరాబాద్, జులై 18 (తీన్మార్ న్యూస్): గ్రూప్ 1, 2 అభ్యర్థులతో తెలంగాణ టూరిజం ప్లాజాలో ప్రభుత్వం తరపున ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, విద్యార్థి నాయకుడు మానవతా రాయ్, బాలలక్ష్మీ, కిరణ్ యాదవ్, చరణ్ కౌశిక్ చర్చలు జరిపారు. గ్రూప్ పరీక్షలు వాయిదా వేయాలనే డిమాండ్ ప్రధాన ఎజెండా జరిగిన ఈ చర్చలు అభ్యర్థులకు సానుకూల

మిగతా 2 లో



ఎమ్మెల్సీ కవిత ఆరోగ్యంపై

## రౌస్ అవెన్యూ కోర్టు కీలక ఆదేశాలు

### కవితను మెడికల్ చెకప్ కోసం ఎయిమ్స్ ఆసుపత్రికి రిఫర్

న్యూఢిల్లీ, జులై 18 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్సీ కవిత ఆరోగ్యంపై రౌస్ అవెన్యూ కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. కవితను మెడికల్ చెకప్ కోసం ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేసింది. కవిత ఆరోగ్యంపై రిపోర్ట్

మిగతా 2 లో

# రెడ్ అలెర్ట్



**మొదటి పేజీ తరువాయి**
రోజుల్లో బలపడి వాయువ్య దిశగా ఒడిశా తీరం వైపు కదిలే అవకాశం ఉందని పేర్కొంది. ఇక తెలంగాణలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది. కరీంనగర్ పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. సూచించినట్టుగానే గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. కాగా శుక్రవారం నుంచి శనివారం వరకు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ అయ్యింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, హన్మకొండ, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది వాతావరణశాఖ. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు రెడ్ అలెర్ట్.. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

## హరీష్ రావు "రుణమాఫీ" ఛాలెంజ్‌పై కాంగ్రెస్ హడావుడి

**మొదటి పేజీ తరువాయి**
రూపంలో కౌంటర్ ఇచ్చారు. హరీష్ సంచలన ప్రకటన యథావిధిగా ఆగస్ట్ 15లోపు రైతు రుణమాఫీ హామీని అమలు చేస్తే హరీష్ రావు రాజీనామా చేస్తానని ఛాలెంజ్ విసిరారని, ఆ సంగతేంటో ముందు చెప్పాలని సోషల్ మీడియాలో కాంగ్రెస్ హడావిడి చేస్తోంది. రైతు రుణమాఫీని ముందుగానే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, తమ చిత్తశుద్ధి నిరూపించుకుంటోందని, హరీష్ రావు రాజీనామా చేసి తన మాట నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఈ ప్రశ్నలకు హరీష్ తాజాగా సమాధానమిచ్చారు. తానిప్పటికీ రాజీనామా ఛాలెంజ్ కి కట్టుబడి ఉన్నానని, అయితే తాను చెప్పినట్టుగా కాంగ్రెస్ అన్ని హామీలు అమలు చేయాలన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలతోపాటు 13 హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు హరీష్ రావు. రైతు రుణమాఫీ సహా, అధికారంలోకి వస్తే 100 రోజుల్లోగా అమలు చేస్తామన్న హామీలన్నిటినీ నెరవేరిస్తే తాను తప్పకుండా రాజీనామా చేస్తానన్నారు హరీష్ రావు. ఆగస్ట్-15లోపు రుణమాఫీ పూర్తి చేయాలని, దానితోపాటు ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తనకు పదవి ముఖ్యం కాదని, తన పదవి పోయినా ప్రజలకు న్యాయం జరిగితే అదే సంతోషమని అన్నారు హరీష్ రావు.తన ఛాలెంజ్ స్వీకరించి అయినా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేస్తే చాలన్నారు. కేవలం రైతు రుణమాఫీపైనే తాను మాట్లాడలేదని, హామీలన్నీ అమలు చేస్తేనే రాజీనామా అని చెప్పానని గుర్తు చేశారు.

## అన్నదాతలకు "సైబర్" అలర్ట్

**మొదటి పేజీ తరువాయి**
వాట్సాప్ ద్వారా అన్నదాతలకు ఏపీకే లింక్స్ పంపిస్తూ నగదు దోచేస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఏపీకే లింక్స్ పంపిస్తోన్న మోసగాళ్లు ఫోన్లు హ్యాక్ చేస్తూ బ్యాంకు ఖాతాల్లో నగదు కొట్టేస్తున్నారు. తాజాగా, నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం గంగ సముద్రంలో ఓ రైతు ఇలానే మోసపోయారు. గ్రామానికి చెందిన ముత్యం రెడ్డి అనే రైతు ఫోన్కు లింక్ పంపిన నేరగాళ్లు అతని ఖాతా నుంచి రూ.4.16 లక్షలు కాజేశారు. దీనిపై బాధిత రైతు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రైతుల్ని అప్రమత్తం చేసింది. ఫోన్లకు వాట్సాప్ ద్వారా వచ్చే ఫేక్ లింక్స్, ఏపీకే ఫైల్స్, అనుమానాస్పద లింక్స్ క్లిక్ చెయ్యొద్దని తెలిపింది. రైతులే లక్ష్యంగా సైబర్ నేరగాళు ఏపీకే లింక్తో మోసాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించింది. ఒకవేళ, పొరపాటున అలాంటి లింక్స్ క్లిక్ చేసి ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించింది. కాగా, తెలంగాణలో రైతు రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రంలో దాదాపు 11.42 లక్షల మంది లబ్ధిదారులకు రైతు రుణమాఫీ కింద సుమారు రూ.7 వేల కోట్లు వారి వారి ఖాతాల్లో జమ చేయనుంది. తొలి విడతలో లక్షలోపు రెండో విడతలో లక్ష యాభై వేలు వరకు, మూడో విడతలో 2 లక్షల వరకు రుణాలు మాఫీ చేయనుంది. మొత్తంగా రుణమాఫీ పరిధిలోకి వచ్చే రైతు కుటుంబాలు 40 లక్షలు ఉన్నట్లు లెక్క తేలింది.

## గ్రూప్ 1, 2 అభ్యర్థులతో సానుకూల దిశగా చర్చలు

**మొదటి పేజీ తరువాయి**
దిశగా ఫలితం వచ్చే దిశగా సాగినట్టు తెలుస్తోంది. నేడో, రేపో గ్రూప్ 1, 2 పరీక్షలు వాయిదా ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. నిరుద్యోగులతో చర్చించిన నేతలు.. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని.. పరీక్షలు వాయిదా వేసేలా ప్రయత్నిస్తామని గ్రూప్ 1, 2 అభ్యర్థులకు భరోసా ఇచ్చారు. గ్రూప్ 2 పరీక్ష నవంబర్ చివరి వారానికి, లేదా డిసెంబర్ వరకు వాయిదా వేయాలని, పోస్టులు పెంచాలని అభ్యర్థులు కోరుతున్నారు. నిరుద్యోగుల డిమాండ్లపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ.. గ్రూప్ 1 లో 1:100 అమలు చేయడం సాధ్యం కాదని.. చాలా రకాల టెక్నికల్ సమస్యలు వస్తాయని అన్నారు. నిరుద్యోగులు చెప్పిన అంశాలన్నీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే సీఎం రేవంత్ ఈ విషయమై ఒక ప్రటకన చేస్తారని తెలిపారు. అప్పటి వరకు డీఎస్సీ పరీక్షల మీద దృష్టి పెట్టాలని పరీక్షలు బాగా రాయలని సూచించారు. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఎలాంటి నిరసనలు చేపట్టవద్దని ఎంపీ చామల కిరణ్ కోరారు. ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారాయన. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30వేల ఉద్యోగాలిచ్చామని త్వరలోనే జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

## వారసత్వ అర్చకత్వాన్ని పునరుద్ధరించాలి



**మొదటి పేజీ తరువాయి**
అర్చకత్వాన్నే నమ్ముకున్నామని, కావున అర్చకుల సమస్యలను తీర్చాలంటూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు గురువారం వినతులు ఇచ్చారు. ఈ మేరకు భద్రాద్రి, వేములవాడ, బాసర వంటి ప్రాచీన దేవాలయాల్లో వారసత్వ అర్చకుల సమస్యలు పెండింగ్ లో ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వారసత్వ అర్చకత్వానికి సంబంధించి 1996లో డాక్టర్ ఎంవీ సౌందరరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై సుప్రీం కోర్టు సానుకూలంగా స్పందించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే వారసత్వ అర్చకత్వానికి తిలోదకాలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలతో పాటు కొన్ని ఆలయాలు మూతపడే ప్రమాదం ఉందని రంగరాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2007లో వారసత్వ అర్చకత్వాన్ని పునరుద్ధరించాలని చట్టం చేసినప్పటికీ.. 16 ఏళ్లు గడుస్తున్నా తెలంగాణలో ఆ చట్టం అమలు కాలేదని చెప్పారు. ఏపీలో 2019లో %+ా వీం% 439ను విడుదల చేసి వేలాది మంది అర్చకుల కుటుంబాలకు బాసటగా నిలిచిని విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో ఆ చట్టాన్ని అమలు చేయకపోగా దేవాదాయ శాఖ వారసత్వ అర్చకుల బదిలీకి పూనుకోలేదన్నారు. పే స్కేల్ అమలు చేయడమే పరిష్కారం అని చెబుతూ ప్రభుత్వాన్ని కొందరు అధికారులు తప్పదోవ పట్టించి అర్చకులు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను తెరమరుగు చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వివరించారు. దీనిపై తక్షణమే స్పందించిన భట్టి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## డీజీపీగారు.. ఈ భాష మీకు అంగీకారయోగ్యమేనా

**మొదటి పేజీ తరువాయి**





పోలీసులు ఓ వాహనదారుడిపై చేయిచేసుకుని బూతులు తిట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీన్ని ట్వీట్ చేసిన కేటీఆర్ డీజీపీ సమాధానం చెప్పాలన్నారు. ఇది పోలీస్ శాఖకు, డీజీపీకి అంగీకారయోగ్యమైన భాషేనా అని డీజీపీని ప్రశ్నించారు. పోలీసులు, ప్రభుత్వ అధికారులకు ప్రజలే జీతాలు చెల్లిస్తున్నారని గుర్తుంచుకోవాలని ప్రజలతో పోలీసులు ప్రవర్తిస్తున్న తీరు అనేకసార్లు తమ దృష్టికి వచ్చిందన్నారని కేటీఆర్ తెలిపారు. పదుల సంఖ్యలో సోషల్ మీడియాలో వీడియోలు వస్తున్నా పోలీసులు స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలతో వ్యవహరించే విషయంలో పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సలహా ఇచ్చారు. హైదరాబాద్లో లారీ డ్రైవర్పై దుర్భాషలాడిన ట్రాఫిక్ పోలీస్పై ఘటనపై పోలీసు శాఖ స్పందించారు. పోలీసులు క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. కేటీఆర్ ట్విటర్ వేదికగా చేసిన ఫిర్యాదు మేరకు తెలంగాణ పోలీసులు చర్యలు తీసుకున్నారు. సైబరాబాద్ జీడిమెట్ల ట్రాఫిక్ లిమిట్స్లో జరిగిందని ఈ ఘటన జరిగినట్లుగా తేల్చారు. బాధ్యుడైన అధికారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నామని అతన్ని ఆ స్టేషన్ నుంచి బదిలీ చేశామని తెలిపారు. తాము 24/7 గంటలూ ప్రజలకు సేవ చేయడానికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. సామాన్యుల పట్ల పోలీసుల వ్యవహారశైలి వరుసగా వివాదాస్పదమవుతూనే ఉంది. అనేక సార్లు దుర్భాషలాడుతూ ఉంటారని ఫిర్యాదులు ఉన్నాయి. ఇలా ఎవరైనా బాధితులు వీడియో తీస్తేనే విషయం హైలెట్ అవుతుంది. పోలీసుల తీరు వల్ల ప్రజలు భయపడుతున్నందునే ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే పద్ధతిని ప్రవేశపెట్టారు. కానీ అదేమీ పెద్దగా ఫలితాలను ఇవ్వలేదు. పోలీసుల నోటి దురుసు తనం వల్ల ముఖ్యంగా కొంత మది తీరు వల్ల ఆ శాఖకు చెడ్డ పేరు వస్తోందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## వీధి కుక్కల దాడి ఘటనపై హైకోర్టులో విచారణ



**మొదటి పేజీ తరువాయి**
దాడి ఘటనలు నివారించేందుకు ప్రభుత్వం స్టేట్ లెవెల్ కమిటీలు ఏర్పాటు చేసిందని తెలిపారు. హైదరాబాద్ లో ఆరు కేంద్రాల వద్ద కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తున్నారని, ఒక్కో కేంద్రం వద్ద సుమారు రోజుకు 200 కుక్కలకు స్టెరైజేషన్ చేస్తున్నారని కోర్టుకి వెల్లడించారు. అయితే, స్టెరిలైజేషన్ ద్వారా దాడి ఘటనలను ఎలా ఆపుతారని హైకోర్టు మరో ప్రశ్న వేసింది. షెల్టర్ హోమ్స్ కి తరలిస్తే సమస్య పరిష్కారం అవుతుందని యానిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపు న్యాయవాది తెలిపారు. నాగ్ పూర్ లో దాదాపు 90 వేల కుక్కలను షెల్టర్ హోమ్ లో పెట్టినట్టు హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలతో యానిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భేటీ అయ్యి పరిష్కారం చూపాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వచ్చే వాయిదాకు పరిష్కార మార్గాలతో రావాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## డీఎస్సీ పరీక్ష వాయిదా పిటిషన్ విచారణ జులై 28కి వాయిదా




హైదరాబాద్, జులై 18 (తీన్మార్ న్యూస్): డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ జులై 28కి వాయిదా పడింది. డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ పది మంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ పై గురువారం న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ విషయంలో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా విద్యార్థుల తరపున సీనియర్ అడ్వకేట్ రవిచందర్ వాదనలు వినిపించారు. నోటిఫికేషన్ కు పరీక్షకు మధ్య నాలుగు నెలల సమయం మాత్రమే ఇచ్చారని, ఈ నాలుగు నెలల వ్యవధిలో ఇతర అనేక పరీక్షలు రాశారన్నారు. సమయాభావం వల్ల పరీక్షను వాయిదా వేయాలని నిరుద్యోగులు అనేక ఆందోళనలు చేశారని కోర్టుకు తెలిపారు. గ్రూప్-1 పరీక్షను కూడా ఇదే రీతిలో నిర్వహించి అభ్యర్థులను గందరగోళానికి గురి చేశారని తెలిపారు. ఇక ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్ రెడ్డి వాదనలు వినిపిస్తూ పది మంది కోసం 2.45 లక్షల మంది నిరుద్యోగులను బలి చేయలేమని పేర్కొన్నారు. టెట్ పరీక్షకు డీఎస్సీకి తగిన సమయం ఉందన్నారు. పరీక్షల కోసం లక్షల మంది నిరుద్యోగులు ప్రిపేర్ అయ్యారని కోర్టుకు వివరించారు. పిటిషన్ వేసిన పది మంది డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేశారా అని కోర్టు ప్రశ్నించింది. గ్రూప్ -1 తో పాటు డీఏవో, డీఎస్సీకి అప్లై చేశారని పిటిషనర్ల తరపున న్యాయవాది వెల్లడించగా పిటిషన్ దాఖలు చేసి ఒకరు కూడా డీఎస్సీ హాల్ టికెట్లు సబ్మిట్ చేయకపోవడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. కాగా మరో వైపు డీఎస్సీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం అయ్యారు. ఆగస్టు 5న ఎగ్జామ్స్ ముగియనున్నాయి.

## శాసనసభ, మండలి సమావేశాలకు నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, జులై 18 (తీన్మార్ న్యూస్): శాసనసభ, మండలి సమావేశాలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 23 నుంచి శాసనసభ, 24 నుంచి శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 23న ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభం కానుంది. శాసనసభ సమావేశాల నేపథ్యంలో జులై 25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది కాంగ్రెస్ ప్రభుత్వం. పది రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పది రోజుల్లో రైతు భరోసా, కొత్త ఆర్ఓఆర్ చట్టం, తెలంగాణ లోగో మార్పు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుతో పాటు పలు బిల్లులపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖల అధికారులతో వరుసగా చర్చలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏయే శాఖలకు కేటాయింపులు ఎలా జరపాలనే అంశంపై సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు అధికారులు.

## రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మాట మార్చారు

హైదరాబాద్, జులై 18 (తీన్మార్ న్యూస్): రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చారు అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రుణమాఫీ అంశంపై ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు అన్ కండిషనల్ గా రెండు లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ చెప్పారు. అలానే చేయాలి తప్ప, అనేక రకాల నిబంధనలు పెట్టి అందరిని ఎగరగొట్టే ప్రయత్నం చేయొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఎం రైతులందరికీ రు-ణమాఫీ చేయాలి అంటే 34 వేల కోట్ల అవుతుందని చెప్పారు. ఇప్పుడు ఏదో ఐదు ఆరు వేలకోట్ల రూపాయలు ఇచ్చి దాన్ని పండుగలాగా, ఏదో చారిత్రాత్మక దినం లాగా కాంగ్రెస్ ప్రభుత్వం వర్ణించే పిచ్చి ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. భారతదేశంలో రుణాలు ఎగవేతకు గురైన రైతులు ఎక్కడున్నారంటే తెలంగాణలో ఉన్నారు అనే అపకీర్తి గత ప్రభుత్వం తెచ్చిపెట్టింది. ఇవ్వాలున్నటువంటి ప్రభుత్వం భేషజాలకు పోకుండా అన్ కండీషనల్ గా రైతాంగానికి చెప్పిన విధంగా రుణమాఫీ చేసి, రైతులను రుణవిముక్తులను చేయాలని ఈటల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్సీ కవిత ఆరోగ్యంపై రౌస్ అవెన్యూ కోర్టు కీలక ఆదేశాలు

**మొదటి పేజీ తరువాయి**
ఇవ్వాలని సూచించింది. కాగా ఇటీవల జైలులో కవిత అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. కాగా ఇటీవల కవిత బెయిల్ పిటిషన్ పై విచారించిన ధర్మాసనం ఆమె జ్యుడిషియల్ కస్టడీని ఈ నెల 22 వరకు పొడిగించింది. ఈ నెల 16న ఎమ్మెల్సీ కవిత ఉన్నట్టుండి అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే స్పందించిన జైలు సిబ్బంది కవితను దీన్ దయాల్ హాస్పిటల్‌కు తరలించారు. ఆమె జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు 2024 మార్చి 15 ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన కవిత జ్యుడిషియల్ రిమాండ్‌లో భాగంగా ప్రస్తుతం ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు. నాలుగు నెలలుగా ఆమె జైలులో ఉన్నారు. ఈ స్కామ్ కు సంబంధించి మొదట కవితపై ఈడీ కేసు నమోదు చేయగా తర్వాత సీబీఐ సైతం ఎంటరైంది. ఈ కేసుల్లో బెయిల్ కోసం కవిత విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

## నీట్ పరీక్ష ఫలితాల విడుదలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

**మొదటి పేజీ తరువాయి**




విద్యార్థులు సాధించిన మార్కులను ప్రచురించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని సుప్రీంకోర్టు ఆదేశించింది. నగరాలు, కేంద్రాల వారీగా అప్ లోడ్ పరీక్ష ఫలితాలు అభ్యర్థుల గుర్తింపును చూపించకుండా ప్రచురించబడతాయి. నగరాలు, కేంద్రాల వారీగా అప్ లోడ్ చేస్తారని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇక లీకేజీ అంశంపై జులై 22 సోమవారం మరోసారి విచారించనున్నట్లు తెలిపింది. 2024 మే 5వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ యూజీ 2024 పరీక్ష నిర్వహించారు. అయితే పరీక్ష పేపర్ లీక్ అవడంతో నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు ఆందోళనలు జరిగాయి. ఫలితాల్లో ఏకంగా 67 మందికి జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు రావడంపైనా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. నీట్ అభ్యర్థుల్లో 1563 మందికి గ్రేస్ మార్కులు కలపడం, ఓఎంఆర్ షీట్లు అందకపోవడం, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు సహా నీట్‌ను రద్దు చేయాలన్న డిమాండ్లతో సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# నిరుద్యోగ విశ్వరూపం

దేశంలో విద్యాధికుల్లో నిరుద్యోగ తీవ్రత ఏ స్థాయిలో ఉందో బుధవారం ముంబై ఎయిర్ పోర్టులో నిరుద్యోగుల తొక్కిసలాట దృశ్యాలే నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా 2000 లోడర్ల పోస్టులకు ప్రకటన ఇస్తే 25 వేలకు పైన నిరుద్యోగులు ముంబై ఎయిర్ పోర్టును పోటెత్తింప చేయడంతో వారిని నియంత్రించలేక సిబ్బంది అష్టకష్టాలుపడ్డారు. ఎయిర్ పోర్టులో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులకు ఆహారం, నీరు లేక అనేక మంది అస్వస్థతకు గురైన దృశ్యాలు దేశంలోని నిరుద్యోగిత తీవ్ర రూపాన్ని పాలకులకు తెలియజెప్పాయి. నిజానికి ఈ ఉద్యోగాలు పెద్దగా విద్యార్హతలు లేని వారి కోసం ఉద్దేశించనవి. విమానం ఎయిర్ పోర్టులో ల్యాండ్ అయినప్పుడు అందులో ప్రయాణికులకు సంబంధించిన లగేజీని దించడం లేదా లోడ్ చేయడం వీరి ప్రధాన విధి. వీరిని లోడర్లుగా పిలుస్తారు. ఈ పోస్టుల కోసం కనీస విద్యార్హతలు అవసరం లేదు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటే చాలు. అయినా ఈ చిరుద్యోగాల కోసం పిజిలు, డిగ్రీలు, చివరికి పిహెచ్‌డిలు చేసిన వారు కూడా హాజరయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో వివరించనక్కర లేదు. ఈ ఉద్యోగాలకి ఇచ్చే జీతం నెలకు రూ. 25 వేలు. ఓవర్ డ్యూటీ చేస్తే మరో ఐదు వేలు వస్తాయి. ఈ ముప్పై వేల జీతానికే 25 వేల మందికి పైగా వచ్చి ఎయిర్ పోర్టు కిక్కిరిసిపోయేలా చేయడంతో విమానయాన ఉన్నతాధికారులే కాకుండా దేశమంతా ఆశ్చర్యపోయిన పరిస్థితి ఏర్పడింది. గడిచిన నెల జులై 2 తేదీన గుజరాత్‌లోని అంక్లేశ్వర్ హెూటల్‌లో రసాయనిక పరిశ్రమ 40 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తే అప్పుడు కూడా వేల మంది హాజరై ఆ హెూటల్ పరిసరాలు కూలిపోయే పరిస్థితులు కనిపించాయి. ఈ రెండు సంఘటనలు కనిపించినవి. ఇంకా కనిపించని నిరుద్యోగ తొక్కిసలాటలు దేశమంతటా సర్వసాధారణంగా మారిపోయాయి.

కాని ఈ చేదు నిజాన్ని అటు కేంద్ర పాలకులు గాని, ఇటు రాష్ట్రాల పాలకులు గాని గుర్తించడం లేదు. నిరుద్యోగ సమస్యలను నిర్మూలించడాన్ని పార్టీలు ఏవైనా, పాలకులు ఎవరైనా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఉద్యోగాల సృష్టికి, నైపుణ్యాల పెంపుకి చిత్తశుద్ధి, శాస్త్రీయ దృక్పథంతో కూడిన విధానాలు అమలు చేయడం లేదు. ఫలితమే నిరుద్యోగం విశ్వరూపం దాలుస్తున్నది. ఇది ముమ్ముందు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో తెలియని విధంగా ఉంది. గుజరాత్‌లో, మహారాష్ట్రలో చిరుద్యోగాల కోసం జరిగిన ఈ తొక్కిసలాటలను కేంద్రం గాని, రాష్ట్రాలు గాని తేలికగా కొట్టిపారేస్తున్నాయి. పైగా దీనిని రాజకీయం చేస్తున్నారని అధికార పార్టీలు విపక్షాలపై దుమ్మెత్తి పోస్తున్నాయి. కాని క్షేత్రంలో నెలకొన్న వాస్తవాలను అంగీకరించడం లేదు. ఈ సంఘటనలు జరగడానికి నెల ముందు దేశంలో ప్రసిద్ధి గాంచిన ప్రపంచ కార్మిక సమాఖ్య, మానవ అభివృద్ధి సంస్థలు సంయుక్తంగా 'భారత ఉపాధి నివేదిక 24' విడుదల చేసిన నివేదిక కూడా నిరుద్యోగ తీవ్రతను గణాంకాలతో సహా వివరించాయి. దేశంలో మొత్తం నిరుద్యోగుల్లో 83 శాతం దాకా యువకులే నిరుద్యోగులుగా ఉన్నారని ఆ నివేదిక స్పష్టం చేసింది. గడిచిన రెండు దశాబ్దాల్లో విద్యావంతుల శాతం గణనీయంగా పెరుగుతుండగా, నిరుద్యోగుల శాతం అంతకంటే రెట్టింపుతో పెరుగుతున్నదని ఇది దేశ ఆర్థిక పరిస్థితికి ప్రమాదమేనని ఆ నివేదిక తేల్చి చెప్పింది. ఇప్పటి దాకా ప్రపంచంలో భారత దేశంలో యువ జనాభా అత్యధికంగా ఉండడం వల్ల అది దేశ ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుందని ఆర్థికవేత్తలు, సామాజిక వేత్తలు చెబుతున్నారు. దీన్ని 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' గా చెప్పేవారు. కాని ఇది లాభం కంటే ఎక్కువ నష్టం చేకూరుస్తున్నదని ఐఎల్‌ఓ రిపోర్టు చెబుతున్నది. ఐఎల్‌ఓ నివేదికను పాలకులు ఆసాంతం చదివి మెదళ్లకు పదును పెడితే తప్ప దేశంలో గుజరాత్, ముంబై సంఘటనలు ముమ్ముందు సర్వసాధారణం కాబోతాయనడంలో అతిశయోక్తి లేదు. దేశం నిరుద్యోగం పెరగడానికి రోజురోజుకూ పెరుగుతున్న డిజిటలైజేషన్, సాఫ్ట్‌వేర్ రంగంలో పెను తుఫాన్ సృష్టిస్తున్న కృత్రిమ మేధ సాంకేతికతో పాటు వ్యవసాయంలో యాంత్రీకరణ, నైపుణ్య శిక్షణా కేంద్రాల కొరత లాంటివి ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల సృష్టి ఆధునిక సవాళ్లకు అనుగుణంగా పెరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు మారాలి. కాలం చెల్లిన విద్యా విధానంలో కూడా పరిశ్రమల అవసరాల అనుగుణంగా సమూల ప్రక్షాళన జరగాలి. ద్విముఖంగా ఈ పోరు ప్రభుత్వాల నుంచి పెరిగితే తప్ప నిరుద్యోగ ప్రళయం ఆగదు.

# ఇబ్బందులు తలెత్తకుండా ఋణ మాఫీ ప్రక్రియ పూర్తి చేయాలి

**- రుణమాఫీపై ఫిర్యాదుల పరిష్కారానికి మండలాల్లో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు**
**- ఇబ్బందులకు గ్రీవెన్స్ పోర్టల్ ద్వార పరిష్కారానికి చర్యలు**
**- జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్**



ములుగు, జులై 18 (తీన్మార్ న్యూస్): రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు ఋణ మాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతు రుణమాఫీ ప్రక్రియపై అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు, పిఎస్ సీఎస్ సొసైటీ ఛైర్మెన్లు, సి ఈ ఓ లు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 12,906 మంది రైతులకు రైతు రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ జరుగుతుందని ఆయన తెలిపారు. మొదటి విడత రుణమాఫీలో భాగంగా ఒక లక్ష రూపాయలు లోపు బకాయిలు ఉన్న రైతుల ఖాతాలలో డబ్బు జమ అవుతుందని తెలిపారు. రెండవ విడత ఈ నెల 31 నుండి ప్రారంభం అవుతుందని అన్నారు. బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా రుణమాఫీ ప్రక్రియ కొనసాగించాలని అన్నారు. రైతుల పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ నంబర్, బ్యాంక్ వివరాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన రుణ వివరాలు, రుణమాఫీ జరిగిన తరవాత మిగిలిన రైతుల వివరాలు కూడా సేకరించాలని, ఋణ మాఫీ వచ్చిన వారి వివరాలు, రాని వారి వివరాలు పక్కగా ఉండాలన్నారు. బ్యాంకులలో ప్రత్యేక సమయం, ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతు ఋణ మాఫీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు పాల్గొనాలని సూచించారు. బకాయిలు ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రెండులక్షల రూపాయల రుణమాఫీ జరుగుతుందని, రైతులు రుణమాఫీకి దరఖాస్తు చేసేప్పుడు తప్పకుండా పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంక్ పాసు పుస్తకాల జిరాక్స్ కాపీలను జతపరచాలని ఆయన పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 09 వ తేది వరకు బ్యాంకుల్లో పంట ఋణాలు తీసుకుని ఇప్పటి వరకు తిరిగి చెల్లించని రైతులకు ఋణ మాఫీ ఉంటుందని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి లో ఋణ మాఫీకి సంబంధించి అర్హుల యొక్క జాభితా వ్యవసాయ శాఖ ద్వారా బ్యాంకులకు తెలియపరచడం జరుగుతుందని అన్నారు. రుణమాఫిలో సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు రాష్ట్ర స్థాయిలో గ్రీవెన్స్ పోర్టల్ ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు ఇబ్బందులు తలెత్తితే గ్రీవెన్స్ పోర్టల్ లో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 9 మండలాల రైతుల సౌకర్యార్థం రుణమాఫీ పై ఫిర్యాదుల పరిష్కారానికి మండలల్లో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని మండలాల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ ను సంప్రదించి సమస్యలు నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, లీడ్ బ్యాంక్ అధికారి డి సి ఓ సర్దార్ సింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, పిఎస్ సీఎస్ సొసైటీ ఛైర్మెన్లు, సి ఈ ఓ లు, బ్యాంక్ బ్రాంచి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ అధికారిని రాజకుమారి బదిలీ

**సన్మానించిన దళిత కార్మిక నాయకులు**
**కార్మికుల ప్రేమానురాగాలను పొందిన రాజకుమారి**
**మారపెల్లి సుధాకర్ దళిత కార్మిక నాయకులు**



పరకాల, జులై 18 (తీన్మార్ న్యూస్): పరకాల అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్గా పనిచేస్తున్న శ్రీమతి రాథోడ్ రాజకుమారి పరకాల నుండి వరంగల్ 1 సర్కిల్ కు బదిలీ కావడం జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మారేపల్లి సుధాకర్ మరియు సిఐటియు జిల్లా నాయకులు అర్షం కుమార స్వామి ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ 2016 అక్టోబర్ 21 నుండి 2024 జూలై 18 వరకు పరకాల సర్కిల్లో విధులు నిర్వహించడం జరిగింది. అందరితో మమేకమై కార్మికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కార్మికుల సమస్యలను తీర్చడంలో ప్రముఖ పాత్ర పోషించిందని ఈ సందర్భంగా అన్నారు. రాజకుమారి సేవలు మరువలేనివని గుర్తు చేసుకుంటూ ఘనంగా సన్మానం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సభ్యులు చిలువేరు సాంబయ్య పోలేపాక మొగిలి బుర్రి భాస్కర్ కోగిల కొర్నేల్ బుర్రి దయాకర్ బొచ్చు పవన్, పూరేళ్లి భాస్కర్, రవీందర్ వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించవలసిన రోజు

**- రుణమాఫీ ప్రపంచ చరిత్రలో చారిత్రాత్మక నిర్ణయం**
**- మాట ఇచ్చాం నిలబెట్టుకున్నాం**
**- కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనమే**
**- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి**



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, జులై 18 (తీన్మార్ న్యూస్): ప్రపంచ చరిత్రలో 2లక్షల రుణమాఫీ కనివిని ఎరుగని రీతిలో రైతు రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించవలసిన రోజుగా అభివర్ణించారు. రైతు దేశానికి వెన్నెముక ఆ రైతుకు వెన్నుదన్నుగా నిలవాలనే ధృఢ సంకల్పంతో అన్నదాతలకు ఆర్థిక సహకారం అందజేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు రుణ విముక్తి కల్పించి, చారిత్రాత్మక నిర్ణయమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట్ మండల కేంద్రంలోని రైతు వేదిక లో రైతులు, రైతు నాయకులు, రైతు కూలీలు, అధికారులతో కలసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇదో అద్భుత కార్యక్రమం, జీవితంలో



మరిచిపోలేని రోజు, దేశానికి ఆదర్శంగా నిలిచే అవకాశం తనకు ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని,కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనం అవుతుందని రుజువు చేశామని అన్నారు. మంత్రుల, అధికారుల సహకారంలో రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష రూపాయల రుణమాఫీ ఒకసారి మాఫీ చేయడం సాధ్యం కాదు, అసలు జరగదు అని ఆనాటి సీఎం కేసీఆర్ స్వయంగా అసెంబ్లీలో ప్రకటిస్తే, ఈనాటి మన సీఎం రేవంత్ రెడ్డి ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకుని కోరారు. గత ప్రభుత్వ నిర్వాహకం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయ్యింది. ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీకి ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సహకరించపోయినా కూడా రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం. ఆగస్టు 15వ తేదీలోగా రైతు రుణాలను మాఫీ చేస్తామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కానీ అంతకంటే నెలరోజుల ముందుగానే హామీని నిలబెట్టుకుని రైతన్నల విషయంలో తమ నిబద్ధతను చాటుకున్నామన్నారు. జూలై 18వ తేదీ లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తున్నామని రైతు రుణ ఖాతాలో డబ్బులు జమ చేశామని సూచించారు. 18వ తేది రోజూను రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించవలసిన రోజు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం దండగా కాదు పండుగ అనే విధంగా పరిస్థితిని మారుస్తున్నామని,రైతన్న కష్టాలు కడతేర్చాలని నడుం బిగించామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 60శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నది. వ్యవసాయ రంగం బాగుంటేనే రాష్ట్ర ప్రజలు, రాష్ట్ర బాగుంటుంది, వ్యవసాయ రంగం అభివృద్ధికి మించిన ప్రాధాన్యత ఈ ప్రభుత్వానికి మరొకటి లేదన్నారు. భవిష్యత్తులో వ్యవసాయాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. రాబోయే కాలంలో ప్రభుత్వం రైతులకు మరింత అండగా నిలుస్తుందన్నారు. రైతును రాజు చేయాలన్నది ప్రభుత్వ అంతిమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు వివిధ గ్రామాల మండల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ముదిరాజు కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలి



**1000 కోట్లు నిధులు కార్పొరేషన్ కు కేటాయించాలి**
**ముదిరాజు కులాన్ని బీసీడి నుండి బీసీ ఏకు మార్చాలి**
**మదనాపురం తహశీల్దార్ అబ్రహం లింకన్ కు వినతిపత్రం**

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, జులై 18 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో ముదిరాజు సోదరులు రాష్ట్ర ముదిరాజు సంఘము పిలుపు మేరకు ముదిరాజు కులాన్ని బీసీ డి నుండి బీసీ ఏ గ్రూపుకు మార్చాలని, ఈ బడ్జెట్ లో ముదిరాజు కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి 1000 కోట్లు ఆ కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలని స్థానిక మదనాపురం తహశీల్దార్ అబ్రహం లింకన్ కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల ముదిరాజు సంఘము అధ్యక్షుడు ఆంజనేయులు, పిఏసీఎస్ వైస్ ఛైర్మన్ చీర్ల శ్రీనివాసులు, వెంకటస్వామి, అజ్జకొల్లు మాజీ సర్పంచ్ బ్రహ్మమ్మ సత్యం, చింతకాయల శ్రీను, వి.శ్రీనివాసులు, వి.రంగన్న, దొరబాబు, రాములు, శివరాములు, వెంకటేష్, గాండ్ల రాము, ధారమోని శాంతన్న, నరేందర్,చుక్క శ్రీను, మొగిలి, బంగ్ల కృష్ణ, డబ్బ కృష్ణ, గిరిబాబు, అంజి, వెంకటేష్, ఏ రాములు, పి.వెంకటేష్, గుగిల్ల రాములు తాతయ్య, విష్ణు, దాసరి రమేష్, రంగం కురుమూర్తి పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ వినియోగదారుల ఫోరం సమావేశం

ములుగు, జులై 18 (తీన్మార్ న్యూస్): విద్యుత్ వినియోగదారులకు సమస్యల పరిష్కారానికి శుక్రవారం రోజున సీజీఆర్ఎఫ్- 1 (కన్స్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ ఫోరం) సమావేశం తాడ్వాయి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించనున్నట్లు, విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ వినియోగదారుల ఫోరం టీజీ ఎన్పీడీసీఎల్, చైర్ పర్సన్ ఎన్వి వేణుగోపాలచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్లో వోల్టేజ్ సమస్యలు, కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లు మార్చడం, లోపాలున్న మీటర్లు మార్చడం, సర్వీస్ పేరు మార్చడం, క్యాటగిరి మార్చడం, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, కరెంట్ బిల్లులో హెచ్చుతగ్గులు సరిచేయడం, విద్యుత్ బిల్లులు నూతన సర్వీస్ మంజూరు తదితర వాటిని ఫోరం అక్కడికక్కడే పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని తాడ్వాయి, గోవిందరావుపేట్, వెంకటాపూర్ (లక్ష్మీదేవి పేట్), ములుగు మండలాల విద్యుత్ వినియోగదారులు ఉదయం 10:30 మధ్యాహ్నం 1:00 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

# మొదటి విడత రుణమాఫీ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం



నారాయణ్ పేట్ జిల్లా ప్రతినిధి, జూలై 18 (తీన్మార్ న్యూస్ ): నారాయణ్ పేట్ జిల్లాలోని మరికల్, ధన్వాడ, వివిధ గ్రామాల్లో పర్యటించి అక్కడి రైతుల సంబరాల్లో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణ మాఫీ చేస్తున్నాం. ఈ దశాబ్ద కాలంలో రైతులకు అతి పెద్ద వేడుకగా రుణ మాఫీ పండుగ చరిత్రలో లిఖించబడిన పెద్ద పండుగ, ఏక కాలంలో రుణ మాఫీ చేయడం రాష్ట్రంలో ఇది రెండవ అతి పెద్ద కార్యక్రమం మొదట వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేయడం జరిగింది.

# రుణమాఫీ మొక్కు తీర్చుకున్న అభిమానులు



నారాయణ్ పేట్ జిల్లా ప్రతినిధి, జూలై 18 (తీన్మార్ న్యూస్): నారాయణ్ పేట్ జిల్లాలోని మక్తల్ నియోజకవర్గంలోని మాగనూర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో నాయకులు తమ అభిమానాన్ని 101 కొబ్బరి కాయల్ని కొట్టి మొక్కు తీర్చుకున్న మండల పార్టీ నాయకులు. అలాగే ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాబి షేకాలు చెయ్యడం జరిగింది.

# ప్రభుత్వం మాటకు కట్టుబడి రుణమాఫీ హామీని నిలబెట్టుకింది

**నేడు 1లక్ష, నెలాకరుకు లక్షన్నర, ఆగస్టు 15లోపు 2లక్షల మాఫీ**

**మాజీ మంత్రి మంత్రి హరీష్ రావు సవాల్ కు కట్టుబడి రాజీనామా చేయాలి**

**పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**







పరకాల, జులై 18 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నదని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఏకకాలంలో లక్ష రూపాయల రైతు రుణమాఫీ చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ గురువారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని హౌస్ బుజుర్గ్ లో ఎడ్ల బండి ఎక్కి ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి నడిపారు. అనంతరం హౌస్ బుజుర్గ్ గ్రామం నుండి ఎమ్మెల్యే స్వయంగా బైక్ నడుపుతూ కటాక్ష పూర్, నీరుకుల్లా, పెంచికల పేట, కామారం, పెద్దాపురం, లింగమడుగు పల్లి, అక్కంపేట, నాగయ్య పల్లి, ఆగ్రం పాడ్ మీదుగా ఆత్మకూరు వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆత్మకూరు మండల కేంద్రంలో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం, ఐదు లక్షల నుండి పది లక్షల వరకు ఆరోగ్య శ్రీ పథకం అమలు, ప్రతి ఇంటికి 200 యునిట్ల కరెంటు ఫ్రీ, మహిళలకు రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, పేదలకు 5లక్షల రూపాయల ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. ప్రతి రైతుకు రుణ విముక్తి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయ విధానంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. రైతన్నలను ఆదుకున్న పార్టీ ఏదైనా ఉంటే అది కాంగ్రెస్ పార్టీయేనని, వరంగల్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ ప్రకటించిన విధంగా రూ. 2 లక్షల రుణమాఫీ నేటి నుండి చేయబోతున్నామని అందుకు 31వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఆగస్టు 15వ తేదీలోగా రైతు రుణాలను మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, కానీ అంతకంటే నెలరోజుల ముందే ఇచ్చిన హామీని నిలబెట్టుకుని నేడు రూ లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసి 7వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని అన్నారు. మూడు విడతల్లో రైతు రుణమాఫీ చేయబోతున్నామని నేడు లక్ష నెలాఖరులోపు లక్షన్నర, ఆగస్టు 15 లోపు రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తున్నామని అన్నారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడం ద్వారా ఈ దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ నిర్వాహకం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేయడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని అన్నారు. రైతు రుణమాఫీ చేస్తే సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు రాజీనామా చేస్తానని సవాల్ విసిరాడని దమ్ముంటే సవాల్ ను స్వీకరించి రాజీనామా చేయాలని లేకుంటే అసెంబ్లీ ముందు గాంధీ విగ్రహం ముందు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని కుంటి చాకులతో తప్పించు కోవాలని చూస్తే ప్రజలు బుద్ధిచెపుతారని అన్నారు.

# మండల రెవెన్యూ అధికారులకు మెమోరాండం అందజేసిన ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు

వరంగల్, జులై 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డా. బండా ప్రకాష్ ముదిరాజ్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి ముదిరాజ్ ఆధ్వర్యంలో నల్లవెల్లి మండలం అలాగే నెక్కొండ మండల రెవెన్యూ అధికారులకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య, టిఎంఎంఎస్ యువత జిల్లా అధ్యక్షులు పోలు అమర్ చంద్, మహిళా అధ్యక్షురాలు గోనెల పద్మ నరహరి డివిజన్ గౌరవాధ్యక్షులు జింకల కొమ్మాలు మరియు మండల అధ్యక్షులు దామ సాంబయ్య పాండవుల రాంబాబు గుండాల శ్రీశైలం కుమారస్వామి పప్పు శంకర్ మాజీ సర్పంచ్ పప్పు రేను ఎద్దు రవి కీసర శ్రీను పిట్టల ప్రవీణ్ పిట్టల రమేష్ అలాగే నెక్కొండ మండల ఎమ్మార్వో గారికి మెమోరాండం



సమర్పించిన కార్యక్రమంలో జింకల కొమ్మాలు నెక్కొండ మండల అధ్యక్షులు తోట సాంబయ్య బల్ల వెంకన్న శ్రీను సింగారం భాస్కర్ అన్ని గ్రామాల్లో కుల పెద్దలు మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**రైతు సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

ఆత్మకూరు, జులై 18 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో రైతు రుణమాఫీ సంబరాల భాగంగా రైతులు మండల కేంద్రంలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు మక్తల్ నియోజకవర్గం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని ఎద్దుల బండి పై పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ రుణమాఫీ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైందని ప్రగతి పతం





సకల జనహితం ప్రజా ప్రభుత్వమని 2022 మే 6న వరంగల్ డిక్లరేషన్ ద్వారా రాహుల్ గాంధీ రైతులకు 2 లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నెరవేరుస్తున్నామని అన్నారు. 15 యేళ్ళు అధికారంలో ఉండి కూడా కేసీఆర్ ఏమీ చేయలేదని వాపోయారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇట్టి కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి కల్లుగీత డిపార్ట్మెంట్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఆయుబ్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతీ రైతును రుణ విముక్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకం**




హన్మకొండ, జులై 18 (తీన్మార్ న్యూస్): వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏకకాలంలో, రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ హన్మకొండ అంబేద్కర్ సెంటర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిదేళ్ల రైతు నిరీక్షణకు తొలగిన గ్రహణం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేసింది. తెలంగాణా వ్యవసాయ చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజు రైతన్నల కోసం రుణమాఫీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రజాప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల వరకు రుణమాఫీ 12 డిసెంబర్ 2018 నుండి 9 డిసెంబర్ 2023 వరకు రైతుల పేరిట ఉన్న బకాయిలకు రుణమాఫీ వర్తింపు. ప్రతీ రైతును రుణ విముక్తి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. రుణమాఫీ పేరుతో కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడంలేదు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికే రూ. 2లక్షల రైతు రుణమాఫీ. అందుకే ఏకమొత్తంలో రూ. 2లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నాం. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. రైతుల ఖాతాలో నేరుగా మాఫీ సొమ్ము జమ, ఆగష్టు 15 లోపు రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తాం. ఈ కార్యక్రమంలో ఈ.శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, శ్రీమాన్, విజయశ్రీ రాజాలి, మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్లు నసీం జహాన్,ఏ. నాగరాజు,నెక్కొండ కిషన్ వి. రవీందర్, బోడా దిన్న,అనుబంధ సంఘాల అధ్యక్షులు బంక సరళ, అజీజ్ ఉల్లా బిగ్, డాక్టర్ రామకృష్ణ,డాక్టర్ శ్రవణ్, సీనియర్ నాయకులు మొహమ్మద్ అంకుష్, పులి రాజు, సయ్యద్ రజాలి, మండల సమ్మయ్య, నల్ల సత్యనారాయణ, బంక సంపత్ యాదవ్, సమత, ఎం.వి రాజు, ఇప్పా శ్రీకాంత్, రహీనున్నిసా బేగం మేరీ సుగుణ, కొండ నాగరాజు, సుధాకర్, బాబా భాయి, షేక్ అజ్గర్, ఎస్ కుమార్ యాదవ్ క్రాంతి భరత్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


# గరిడేపల్లి లో దొంగల హల్ చల్

**తాళాలు వేసిన ఇండ్లలో చోరీ**

**మధ్యాహ్నం రెక్కీ రాత్రి సమయంలో చోరీ**



గరిడేపల్లి, జులై 18 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో బుధవారం రోజు రాత్రి జరిగిన వరస చోరీలలో రెండు ఇళ్లలో దొంగలు పడ్డారు. గరిడేపల్లి ఈట సైదులు అందించిన వివరాల ప్రకారం మహమ్మద్ ఖాజా మెయినుద్దీన్ అనునతను జడ్పీహెచ్ఎస్ స్కూల్ గడ్డిపల్లి నందు టీచర్ గా పని చేస్తూ గరిడేపల్లి లోని యడవెల్లి వెంకటరెడ్డి ఇంటిలో కిరాయికి ఉంటున్నారు. అయితే ఆయన మొహర్రం పండగ సంధర్భంగా తన సొంత ఊరు కోదాడ కు వెళ్ళగా బుధవారం రోజు అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వెళ్ళి బీరువా



లోని తులంన్నర బంగారు వస్తువులు గోల్డ్ బ్రస్లెట్, చైన్ లాకెట్, చెవి దిద్దులు దొంగిలించుకొని వెళ్ళినారు అని మహమ్మద్ ఖాజా మెయినుద్దీన్ ఫిర్యాదు చేసినాడు.

2) యనమదల రామచందర్ రావు ఇంటిలో బుధవారం రోజు అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వెళ్ళి బీరువా లోని 1, 50, 000/- నగదు ను దొంగిలించుకొని వెళ్ళినారు. అని ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసి ధర్యాప్తు చేయడం జరుగుతుంది అని యస్ ఐ ఈట సైదులు తెలిపినారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానిత వ్యక్తులు కనిపించినట్టయితే 100 కు కాల్ చేయాలని తెలిపినారు. ప్రజలు ఎవరైనా ఊరు వెళ్లేవారు ఉంటే పోలీసులకు తెలియపరచి వెళ్ళవలసిందిగా ఎస్ ఐ ఈట సైదులు తెలిపినారు.

# తీన్మార్ వార్తకు స్పందన

**'చిత్తడి చిత్తడే' శీర్షికకు స్పందించిన మున్సిపల్ పాలకవర్గం**

ఆత్మకూర్, జులై 18 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో గత జులై 16వ తేదీన చినుకు పడితే 'చిత్తడి చిత్తడే' శీర్షిక ద్వారా ప్రచురుతమైన వార్తకు ఆత్మకూర్ మున్సిపల్ పాలకవర్గం మున్సిపల్ సిబ్బంది స్పందించి ట్రాక్టర్ల ద్వారా స్థానిక ప్రభుత్వా జూనియర్ కళాశాల మరియు గాంధీ చౌరస్తాలో రోడ్డుపై వర్షపు నీరు ఆగిన మడుగులో మొరంమట్టిన పోసి చదును చేశారు. పట్టణ ప్రజలకు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశారు. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్, కమీషనర్ నాగరాజు, V కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



## చినుకు పడితే చిత్తడి చిత్తడే

**- గుంతల మాయంగా వర్షపు నీటితో రహదారులు**

ఆత్మకూర్, జులై 16(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో చినుకు పడితే చిత్తడి చిత్తడిగా రహదారులు ఉన్నాయి. మున్సిపాలిటీ అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన రోడ్లపై ఎక్కడికక్కడే వర్షపు నీరు నిల్వ ఆగి ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందర, స్థానిక గాంధీ చౌరస్తాలో, నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో రోడ్లపై వర్షపు నీరు ఒక మడుగు రూపంలో నిల్వ ఉన్నాయి. ఎన్నిసార్లు మున్సిపల్ కమిషనర్ కి, మున్సిపల్ చైర్మన్కు విన్నపించిన ఫలితం లేదని పట్టణ ప్రజలు వాపోయారు. మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మున్సిపల్ పరిధిలో గుంతల రహదారులలో మొరం మట్టి వేసి గుంతలు పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రయాణికులు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తీన్మార్ www.teenmaarepaper.com 17 Jul 2024 - Page 3





# మానవత్వం చాటుకున్న అమరచింత ఎస్సై





ఆత్మకూరు, జులై 18 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో గుర్తు తెలియని వృద్ధురాలు 60 సంవత్సరాల లక్ష్మమ్మ కాలు ఇన్ఫెక్షన్ కావడంతో అమరచింత వాక్స్ బోర్డు షెటర్ల వద్ద ఆమె పడుకొని ఉంది.

ఈ విషయాని గమనించిన అమరచింత ఎస్సై సురేష్ వెంటనే అంబులెన్స్ను పిలిపించి, అమరచింత మున్సిపల్ సిబ్బంది సహకారంతో లక్ష్మమ్మకు పక్కన ఉన్న హోటల్లో వస్త్రాలు మార్పించి వైద్య నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక ఎస్సైను అభినందిస్తున్నారు.

# పెండింగ్ డిఎలను వెంటనే చెల్లించాలి

**జిల్లా అధ్యక్షులు అమరేందర్ రెడ్డి**

వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, జూలై 18 (తీన్మార్ న్యూస్): ఉద్యోగ ఉపాధ్యాయులకు బకాయి పడ్డ డి ఏ లను ఏరియర్స్ తో సహా వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమిస్తామని తపస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వేముల అమరేందర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ జిల్లా మీడియా కన్వీనర్ శశివర్ధన్ గురువారం తీన్మార్ పత్రిక ముఖంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# తెలంగాణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సమావేశాన్ని జయప్రదం చేయండి



నేరేడుచర్ల, జులై 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం మరియు ఫోటో టెక్ ఆధ్వర్యంలో ఈనెల 26 27 28 తేదీల్లో హైదరాబాద్లో జరుగు పోస్టర్ని ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కూకుంట్లలాలయ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంగూరి యాదగిరి జిల్లా కోశాధికారి బండారు లాలూ మరియు జిల్లా కుటుంబ ఇన్చార్జి గొట్టం రవి జిల్లా మీడియా ఇన్చార్జి నగేష్ చేపూరి లక్ష్మణరావు సూర్యాపేట జిల్లా సలహాదారు ఉద్దోజు శ్రీనివాసచారి మరియు మండల గౌరవ అధ్యక్షులు చందమల్ల శ్రీరాములు మండల అధ్యక్షులు ఇంజామూరి వెంకటేశ్వర్లు కోశాధికారి నరసింహ చారి ప్రధాన కార్యదర్శి పంగ బుచ్చిబాబు మరియు మండల ఫోటోగ్రాఫర్లు రవి. చరణ్ సందీప్ గౌస్ లతీఫ్ మహేష్ రాజేష్ నీలా సందీప్ సురేష్. బెంజిమెన్ మధు మరియు హుజూర్నగర్ ఫోటోగ్రాఫర్లు కృష్ణ జాన్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఇటీవల గాయపడిన వింజమూరి మధుకి రాష్ట్ర అసోసియేషన్ కుటుంబ భరోసానుండి 10000 రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించడం జరిగింది జిల్లా అధ్యక్షుల ద్వారా చెక్కు బహుకరించారు.

# వీధి కుక్కల దాడిలో మరణించిన బాలుని కుటుంబాన్ని పరామర్శించిన ఈటల




జవహర్ నగర్ ప్రతినిధి, జులై 18(తీన్మార్ న్యూస్): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 28వ వార్డులో కుక్కల దాడిలో మరణించిన బాలుని కుటుంబాన్ని గురువారం పరామర్శించడానికి స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్ పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కుక్కల దాడిలో బాలుడు మరణించడం నన్నెంతో కలిసిందని ఆవేదన వ్యక్తం చేశారు, పేదల జీవితాలు అంటే మున్సిపల్ అధికారులకు కూడా లెక్కలేకుండా పోయిందని, జవహర్ నగర్ యొక్క స్థితిగతులు అన్నీ కూడా సీఎం రేవంత్ రెడ్డికి అవగాహన ఉందని కనీసం ఇక్కడ పరిస్థితులు తెలిసి కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం చాలా దారుణం అని విమర్శించారు, ఇప్పటికైనా బాధ్యత కుటుంబానికి సరైన న్యాయం ఒక ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.వారి వెంట బిజెపి మేడ్చల్ జిల్లా ఇన్చార్జ్ విక్రమ్ రెడ్డి, కంటోన్మెంట్ ఇంచార్జ్ విజయ రామారావు, మేడ్చల్ ఎమ్మెల్యే కంటెస్టెంట్ ఏనుగు సుదర్శన్ రెడ్డి, బిజెపి కార్యకర్తలు, స్థానిక నాయకులు బూడిద వెంకటేష్, బస్తీ వాసులు మహిళలు పాల్గొన్నారు.

# రైతు రుణమాఫీ సంబరాలు

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, జూలై 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణ మాఫీ ద్వారా జమ అయ్యే ఋణం గైడ్ లైన్స్ ప్రకారం రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నేరుగా రైతులకు చేరేలా బ్యాంకర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలని వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువార%శీ% పెద్దమందడి మండలంలో రైతు వేదిక లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో, జిల్లా స్థాయి బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పాలక మండల సభ్యులు రామచంద్ర రెడ్డి, కలిసి రైతు రుణమాఫీ మార్గదర్శకాల అమలుపై మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా వేల కోట్ల రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తునట్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మొదటి విడతలో పెద్ద మందడి మండల పరిధిలో 2.453 రైతులకు రుణ మాఫీ లబ్ధి చేకూరుతుందని అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏఓ) సైదులు పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రుణమాఫీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండ వారి రుణఖాతాలో %శ్రీ%జమ అయిన డబ్బులను నేరుగా రైతులకే అందేటట్లు చూడాలన్నారు. ఈ సందర్భంగా పెద్దమందడి మండల ఏవో సైదులు గారు మాట్లాడుతూ, పెద్దమందడి మండల పరిధిలో 2,453 రైతులకు మొదటి విడతలో భాగంగా రుణమాఫీ. వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి రైతు వేదికలో రైతుల జాబితాను ప్రదర్శించాలన్నారు. రైతులకు సంబంధించిన 1 బి, అదార్ కార్డు , భూమికి సంబంధించిన్ పాస్ పుస్తకం తదితర డాకుమెంట్స్, తీసుకొని రెనివల్ కోసం బ్యాంకు కు రావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతిలో కూడా రైతులకు సంబంధించి వివరాలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని పెద్దమందడి మండల వ్యవసాయ అధికారి ఏఈఓ లను ఆదేశించారు. 30 రోజుల పాటు వ్యవసాయ అధికారి విస్తరణ అధికారులు అందుబాటులో ఉండి రైతు రుణమాఫీ రైతులకు చేరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డ్ పాలక మండలి సభ్యుడు రామకృష్ణారెడ్డి, పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సి. పెంటన్న యాదవ్, మండల్ ఇంచార్జ్ కోట్ల రవి, మాజీ ఎంపీపీ టి.రఘు ప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గట్టు మన్యం, పెద్దమందడి మాజీ సర్పంచ్ వెంకటస్వామి, వెలటూరు మాజి సర్పంచ్ ఆర్.శ్రీనివాస్ రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏ ఓ)సైదులు, వెలటూర్ ఏఈఓ వినోద్, మోజర్ల ఏఈవో రజిని, పామ్ రెడ్డి పల్లి ఏఈఓ మధు, బలిజపల్లి ఏఈఓ రజిని, పెద్దమందడి ఏఈఓ కృష్ణయ్య, మణిగిల్ల ఏఈవో జయ ప్రకాష్, పెద్దమందడి, మాజీ జెడ్పిటిసి కొమ్ము వెంకటస్వామి, వెల్టూరు మాజీ సర్పంచ్ ఆర్.శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో మాటీ డైరెక్టర్ ఐ.సత్యరెడ్డి, మాజి ఎంపిటిసి దామోదర్, సి.వెంకటయ్య, రామ్ చంద్ర గౌడ్, గట్టు యాదవ్, అల్వాల్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్ రెడ్డి,పుల్లన్న యాదవ్, టైలర్ రవి,మండల కాంగ్రెస్ అధ్యక్షు సి. పెంటన్న యాదవ్, వెలటురు మాజీ సర్పంచ్ కుర్వ బాలచంద్రయ్య, పెద్దమందడి ఎస్సీ సెల్ అధ్యక్షుడు గట్టు దయాకర్, పెద్దమందడి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, వడ్డే శేఖర్, డీలర్ శ్రీను, దిండు వివేక్, దిండు రవి, తదితరులు పాల్గొన్నారు.

# మూలమల్లలో రైతు రుణమాఫీ సంబరాలు

## గ్రామంలో వార్డు వార్డున బైక్ ర్యాలీ



ఆత్మకూరు, జులై 18 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు నేస్తంలో భాగంగా రైతులకు ఏకకాలంలో లక్ష రుణమాఫీ చేసిన సందర్భంగా గ్రామంలో వార్డు వార్డున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.రాజశేఖర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు వినయ్ కుమార్ రెడ్డి యుగంధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ ఏ సుధాకర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పి ఆనంద్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపిటిసి లక్ష్మన్న,సైక సహదేవుడు,వల్లూరి ఉషన్న, వి.సత్యన్న,అద్దాల వెంకటన్న, ఎం. కుమార్, గజేందర్ రెడ్డి యువ నాయకులు సి.శేఖర్, రాజు, కే శేఖర్, రాహుల్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



# మాటిచ్చాం.. నెరవేస్తున్నాం రైతు రుణమాఫీ

## ఈ దశాబ్దపు అతిపెద్ద వేడుక రైతన్నలకు రుణమాఫీ పండుగ

## ప్రగతి పతం సకల జనహితం మన ప్రజా ప్రభుత్వం

## మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి





ఆత్మకూర్, జులై 18 (తీన్మార్ న్యూస్): రైతు నేస్తం రైతు రుణమాఫీ సంబరాల్లో భాగంగా వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక బాలకిష్టాపూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయాగ్రామల రైతులతో పార్టీ కార్యకర్తలతో ఆత్మకూర్ గాంధీ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌరస్తాలో స్థానిక మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మాటిచ్చాం నెరవేస్తున్నాం రైతు రుణమాఫీ ఈ దశాబ్దపు అతిపెద్ద వేడుకగా రైతన్నలకు రుణమాఫీ పండుగ రైతు రుణమాఫీ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైందని ప్రగతి పతం సకల జనహితం మన ప్రజా ప్రభుత్వం అని అన్నారు. 2022 మే 6న వరంగల్ డిక్లరేషన్ ద్వారా రాహుల్ గాంధీ రైతులకు 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నెరవేస్తున్నామని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి కూడా కేసీఆర్ 28 వేల కోట్లు కూడా రైతన్న మాకు చేయలేకపోయారు ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేస్తామని పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో చెప్పాము. ఆర్థిక నిపుణులు కూడా రుణమాఫీ కష్టమని చెప్పినా ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి అన్న కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి ఆనాడు సోనియమ్మ తెలంగాణ ఇచ్చారు పార్టీకి నష్టమని తెలిసిన కూడా సోనియా గాంధీ ఆనాడు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం రైతు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట చేసి తీరుతామన్న నమ్మకం మాట యావత్ తెలంగాణ ప్రజానీకానికి ఉందని రైతు సంక్షేమంలో ఈ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని వ్యవసాయ విధానంలో తెలంగాణ మాటలను దేశం అనుసరించేలా ఉండాలని రూ 7 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాలో వెళ్ళనున్నాయని ప్రతి రైతు రుణ విముక్తి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పెద్దలు సోనియా గాంధీ రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇట్టి కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి కల్లుగీత డిపార్ట్మెంట్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయచూర్ పరమేష్, పట్టణ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు, మక్తల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజ్ యాదవ్,మాజీ మండల అధ్యక్షులు రహమతుల, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా తరలిస్తున్న రెండు బైకులు స్వాధీనం, ముగ్గురి అరెస్ట్





పరకాల, జులై 18 (తీన్మార్ న్యూస్): పరకాల ఎక్సయిస్ స్టేషన్ ఫరిది లో ఈరోజు ఉదయం, మధ్యాహ్నం రూట్ వాచ్ లు నిర్వహించి రెండు ద్విచక్ర వాహనాలను, (30) లీటర్లు గుడుంబా ను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేయడం జరిగింది. ఉదయం శాయంపేట మండలం సూర్యనాయక్ తండా నుండి వసంతాపూర్ వైపు జరుపుల లింగా నాయక్ అనే వ్యక్తి యమహా ఫాసినో స్కూటీ పై (20)లీటర్లు గుడుంబా తరలిస్తుండగా పట్టుకొని అరెస్ట్ చేసి కేసు నమోదుచేయడం జరిగింది. మధ్యాహ్నం సంగెమ్ మండలం పల్లారిగూడ నుండి గీసుకొండ మండలం ఊకల్ కు హీరో హొండా స్ప్లెండర్ పై గుడుంబా రవాణా చేస్తున్న గుగులోత్ సమ్మయ్య, గుగులోత్ ధర్మ అనే వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్దనుండి (10)లీటర్ల గుడుంబా, బైకు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగింది. ఇందులో పి. తాతాజీ సీఐ, వై. జ్యోతి ఎస్ఐ, లక్ష్మణచారీ హెడ్ కానిస్టేబుల్, దిలీప్ కాన్స్టేబుల్, అఖిల్ కాన్స్టేబుల్, శ్రీనివాస్, కాన్స్టేబుల్ పాల్గొన్నారు.

# కార్పొరేషన్ పూర్తి సహకారం అందిస్తా

## మాజీ మంత్రి మల్లారెడ్డి

## పాదయాత్రతో సమస్యలకు పరిష్కారం చూపుతా

## అభివృద్ధి పనులకు రూ. 80 లక్షలు కేటాయింపు

## ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



జవహర్ నగర్ ప్రతినిధి, జులై 18 (తీన్మార్ న్యూస్): కార్పొరేషన్ ప్రగతికి కలిసికట్టుగా పనిచేద్దామని, మరోసారి పాదయాత్ర చేసి సమస్యలకు పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ శాంతి అధ్యక్షతన గురువారం అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ జవహర్నగర్లో ప్రతి బస్తీలో పారిశుద్ధ్యం పడకేసిందని, గంజాయి, కుక్కల బెడదతో ప్రజల్లో అభద్రతాభావం పెరుగుతుందని అన్నారు. సీజనల్ వ్యాధులు సంభవించే కాలంలో అధికారులు సెలవులు పెడుతూ అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోనాల పండుగకు 30 లక్షలు, ప్రతి కాలనీలో కుక్కల బెడదను తగ్గించేందుకు రూ. 50 లక్షల నిధులు కేటాయించాలని చెప్పారు. జవహర్ నగర్ లో కలియతిరిగి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపేలా చేస్తానని హామీ ఇచ్చారు. కుక్కల దాడిలో మరణించిన బాలుడి కుటుంబానికి ఆసరయ్యేలా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కాజ్మోహన్రెడ్డి. ఆర్టీ ప్రభాకర్యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మాజీ మేయర్ మేకల కావ్య, కార్పొరేటర్లు, కోఆప్షసభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఊరూరా రైతు రుణమాఫీ సంబరాలు

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రాండ్‌గా సీఎంకు కృతజ్ఞతలు



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, జులై 18 (తీన్మార్ న్యూస్): ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ మొదటి విడత ప్రకటించిన జాబితాలో వారి రుణాలు మాఫీ అవుతుండడంతో రైతులు ఆనందంతో ఉప్పొంగి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.వనపర్తి జిల్లా మదనాపురం మండలం తీర్మాలయాపల్లి గ్రామంలో కేక్ కట్ చేసుకుని మిఠాయిలు పంచుకున్నారు.రుణ మాఫీతో తెలంగాణ రైతులు సంబరాలు చేసుకుంటున్నారు.గత ప్రభుత్వాలు చేయలేని పనిని కాంగ్రెస్ సర్కార్ చేసి చూపించిందని అనందం వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ సంబరాలు జరుపుకుంటున్నారు. రుణమాఫీ అవుతున్న ఆనందంతో కేరింతలు కొడుతూ పశువులకు తిలకం దిద్ది ఒకరికొకరు అలయ్ బలయ్ చేసుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. రుణమాఫీ విషయంలో గత ప్రభుత్వాలు మాటలకే పరిమితమయ్యాయన్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇవాళ లక్ష రుణమాఫీ చేస్తోందన్నారు. రైతులు గ్రామ గ్రామాన కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలోనూ వేడుకలు గ్రాండ్‌గా జరుపుకున్నారు.రుణ మాఫీ హామీ ఇచ్చి తమకు ఆర్థికంగా అండగా నిలిచినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పారు.

# తాత్కలిక ఉద్యోగులతోనే హెచ్ఎండీఏ

హైదరాబాద్: హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో హెచ్ఎండీఏది కీలక పాత్ర. ఏడు జిల్లాల పరిధిలో విస్తరించి, మౌలిక వసతులు, భవన నిర్మాణ అనుమతులలో అత్యంత ప్రముఖ పాత్రను పోషిస్తుంది. హైదరాబాద్ పరిధిని విస్తరించేలా, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామంటూ ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. అదే సమయంలో హెచ్ఎండీఏను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, సంస్థ బలోపేతానికి అవసరమైన మానవ వనరుల కొరత ఇప్పుడూ ఆ సంస్థను వేధిస్తున్నాయి. ఏళ్లుగా ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో, డిప్యూటేషన్ ఉద్యోగులతో నెట్టుకొస్తుంది. దీంతో హెచ్ఎండీఏ అధికారులను పూర్తి స్థాయిలో అమలులోకి రావడంలో జాప్యం జరుగుతుంది. గడిచిన కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను ఇకనైనా భర్తీ చేస్తే గానీ హెచ్ఎండీఏ బలోపేతం సాధ్యం కాదనీ పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. భారీ లేఅవుట్లు, ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టులు, సిటీ నలువైపులా కొత్త కొత్త టౌన్‌షిప్‌లకు అనుమతులు ఇవ్వడంలో హెచ్ఎండీఏదీ ప్రధాన పాత్ర. అంతే కాకుండా నగరానికి మణిహారంగా ఉన్న ఓఆర్ఆర్ నిర్వహణ, అవుటర్‌కు సమీపంలో లంగ్ స్పేస్‌ను పెంచడంలో కీలకమైన అర్బన్ ఫారెస్ట్ పార్కుల నిర్మాణంతో పాటుగా మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం వంటి వ్యవహారాలన్నీ హెచ్ఎండీఏ నిర్వహిస్తోంది. ఇందులో ప్లానింగ్, ఇంజనీరింగ్‌తో పాటు అర్బన్ ఫారెస్ట్రీ వంటి ప్రధాన విభాగాలు ఉండగా, హెచ్ఎండీఏ ఇప్పటివరకు ఎన్నో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులు, నిర్మాణ అనుమతులను జారీ చేసింది. ఓ వైపు నిర్మాణ అనుమతులకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా, నిర్మాణ అనుమతులను పర్యవేక్షించడానికి ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. అదే విధంగా కీలకమైన ప్రాజెక్టులను చేపట్టే ఇంజనీరింగ్ విభాగం కూడా చాలీచాలనీ సిబ్బందితో నెట్టుకొస్తుంది. ఎక్కడా ఏ ప్రాజెక్టును చేపట్టాలి. ఎప్పుడూ వాటిని పూర్తి చేయాలనే విషయాలను పర్యవేక్షించేందుకు సిబ్బంది కరువైంది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్ఎండీఏ పరిధిని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించాలనే ప్రతిపాదనలను తెర మీదకు తీసుకువస్తున్న తరుణంలో, సిబ్బంది కొరత ఇప్పుడు ఆ విభాగంలో చర్చనీ యాంశంగా మారింది. 18 ఏండ్ల కిందట హెచ్ఎండీఏకు 600 పోస్టులు మంజూరైతే, ఇప్పటివరకు ఉద్యోగుల సంఖ్య 15శాతం లోపే ఉంటుంది. ఇక ఉద్యోగులందరినీ డిప్యూటేషన్, అవుట్ సోర్సింగ్ విధానంలో ఎప్పుడో భర్తీ చేసిన సిబ్బందితోనే ఇప్పటికీ నెట్టుకొస్తున్నారు. ఇన్నాళ్లుగా డిప్యూటేషన్ విధానంలో నెట్టుకొచ్చినా, పరిధిని పెంచే యోచనలో ఉన్న ప్రభుత్వానికి భర్తీ విషయంపై దృష్టి పెట్టాలని అంటున్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఖజానా నింపడంలో కీలకమైన ప్లానింగ్ విభాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటివరకు మాతృ సంస్థ ఉద్యోగులను కాదనీ, డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులే వ్యవహారాలు చక్కబెట్టుస్తున్నారు. ఈ క్రమంలో బిల్డింగ్, లే అవుట్ అనుమతుల విషయంలో కీలకమైన ఈ విభాగాన్ని పూర్తి స్థాయిలో మాతృ సంస్థ ఉద్యోగులను తీసుకు రావడం వలన, పాలన వ్యవహారాల్లోనూ పారదర్శకత పెరుగుతుంది. కానీ, ప్రభుత్వం అవేవీ పట్టనట్లుగా కేవలం పరిధి పెంచి ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తూ రెవెన్యూ పెంచుకునేందుకు దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. సిబ్బంది కొరత కారణంగా పని ఒత్తిడి పెరుగుతుందే తప్పా? సమర్థవంతంగా పనిచేసే సిబ్బంది లేరని హెచ్ఎండీఏ వర్గాలు చెబుతున్నాయి. అధికారంలోకి వస్తే లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ చెప్పిన కాంగ్రెస్ అధినేత రేవంత్ రెడ్డి, ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాల భర్తీపై ఒక్కసారి కూడా చర్చించలేదు. ప్రధానంగా ప్రభుత్వానికి రెవెన్యూ తీసుకు రావడం లో కీలకమైన ప్లానింగ్ విభాగాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. తాజాగా అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్న ఉద్యోగులు, పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ లేఖలో జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. 44 మంది ఉండాల్సిన విభాగంలో కేవలం ఒక్కరే ఉన్నారని, మిగిలిన వారంతా అవుట్ సో ర్సింగ్, డిప్యూటేషన్‌పై వచ్చినవారే ఉన్నారు. అదే విధంగా ఏఈఈ, జూనియర్ అసిస్టెంట్లు, అర్కిటెక్చరల్ డ్రాఫ్ట్‌మెన్, టైపిస్టులు ఇలా 200కు పైగా ఉద్యోగుల భర్తీ తక్షణమే చేయాలని కోరింది. అదే సమయంలో ఉద్యోగాల భర్తీ చేయకపోవడంతో అన్ని రిటైర్డ్ అయ్యేవారితో విభాగాలన్నీ ఖాళీ అవుతున్నాయని హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్ర మంలో ఉద్యోగులకు వచ్చే ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందని, ఉన్నత స్థాయి క్యాడర్లలో ఉండే ఉద్యోగాలకు డీటీసీపీ, ఇతర ఇతర ఇంజనీరింగ్ శాఖల నుంచి ఉద్యోగులు రావడంతో, మాతృ సంస్థలో నియమితులైన ఉద్యోగులు పదోన్నతి అవకాశాలను కోల్పోతున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలో హెచ్ఎండీ ఏ పరిధిని పెంచాలని భావిస్తున్న ప్రభుత్వం తొలుత పూర్తి స్థాయి సిబ్బంది నియామాకంపై దృష్టి పెట్టాలన్నారు. సరిపోయేంత సిబ్బంది ఉన్నప్పుడే హెచ్ఎండీఏ పాలనా వ్యవహారాలు మెరుగుపడతాయని, లేదంటే ఆదాయ వనరులను కోల్పోయే అవకాశం ఉంటుందని హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి.

## రివెరిఫికేషన్తో పదిలో పది పాయింట్లు సాధించిన విద్యార్థి

### మార్చి ఫలితాలలో కౌంటింగ్ తప్పిదం
### పది జీపీఏ కోల్పోయిన విద్యార్థి సంజయ్



నేరేడుచర్ల, జులై 18 (తీన్మార్ న్యూస్): పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన సమయంలో పరీక్ష పత్రం దిద్దిన ఉపాధ్యాయుని అజాగ్రత్తతో తెలుగులో పది పాయింట్లు రావలసిన విద్యార్థికి 8 పాయింట్లు రావడంతో స్టేట్ ఫస్ట్ ర్యాంకును కోల్పోయాడు. వివరాల్లోకి వెళితే స్థానిక శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థి పర్వతం సంజయ్ మార్చి పదవ తరగతి ఫలితాలలో అన్ని సబ్జెక్టులలో పదికి 10 జిపిఏ సాధించిన తెలుగులో మాత్రం 8 పాయింట్లు సాధించడంతో మొత్తంగా 9.7 జిపిఏ సాధించాడు. ఫలితాలు విడుదల అయినప్పటి నుండి తన మార్కుల పట్ల అసంతృప్తితో ఉండి రీవెరిఫికేషన్కు అప్లై చేసుకోగా తెలుగులో కౌంటింగ్ తప్పిదంతో రాత పరీక్షలో 80 మార్కులకు 77 మార్కులు రావాల్సి ఉండగా, కేవలం 57 మార్కులు మాత్రమే వేశారు. నేడు ఎస్ఎస్సి పరీక్షల విభాగం నుంచి వెలువడిన రివెరిఫికేషన్ ఫలితంలో తెలుగులో పదికి పది జీపీఏ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొనతం సీతారాం రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత ఫలితంతో తమ పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు 10 జీపీఏ తో స్టేట్ ర్యాంకులు సాధించారని తెలిపారు. పది పాయింట్లు సాధించిన విద్యార్థి సంజయ్ కి పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

## హస్తకళలకు ప్రోత్సాహం

### మంత్రి పొన్నం

హైదరాబాద్: ముషీరాబాద్ లోని హస్తకళా భవన్ లో హ్యాండ్ క్రాఫ్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాయడు సత్యనారాయణ గౌడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ హస్తకళల కార్పొరేషన్ 2013 లో ఏర్పడినప్పటికీ 2015 నుండి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించుకున్నాం. క్షేత్ర స్థాయిలో కళా నైపుణ్యం వారిని వృత్తులకు ప్రోత్సహిస్తూ వారికి మార్కెటింగ్ సౌకర్యానికి వేదికగా ఈ సంస్థ ముందుంది. 61 కోట్ల టర్నోవర్ చేస్తుంది. దానిని 600 కోట్ల టర్నోవర్ కి తీసుకుపోవాలి. ప్రభుత్వం అతిథులకు బయట దేశం, బయటి రాష్ట్రం నుండి వచ్చే అతిథులకు బహుమానాలు ఇస్తుంటారు. చేనేత వృత్తులకు ప్రోత్సహించడానికి చేనేత వస్త్రాలను ప్రభుత్వం తరుపున వివిధ సంస్థలకు ఇవ్వడానికి జీవో నెంబర్ 1 ద్వారా టెస్కో ద్వారా కొనుగోలు చేస్తారు. ఇవి కూడా ముఖ్యమంత్రి ,ఆర్థిక మంత్రి మాట్లాడి హస్తకళలు సంబంధించినవి వచ్చినప్పుడు ఈ కార్పొరేషన్ నుండి తయారు చేసినవి మాత్రమే కొనుగోలు చేసేలా జీవో తేవాలి. నేను కూడా సహకరిస్తా. ఈ పరిశ్రమ మార్కెట్ లో వందల కోట్ల టర్నోవర్ ఉంది హస్తకళలు ఎక్కడికి వెళ్ళినా బహుమతి ఇచ్చే కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలంగాణ వృత్తి కళాకారుల ద్వారా చేనేత, హస్తకళల అనేక రకాల వస్తువులు కొనుగోలు చేసే విధంగా షోరూంలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం తరుపున హస్తకళలు, చేతి వృత్తులు, చేనేత కలలు ప్రోత్సాహం ఉంటుంది. ఈ సంస్థ మరింత ఎదగాలి. నాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో మరింత ముందుకు పోవాలని అన్నారు.

# పెండింగ్ప్రాజెక్టులపై సర్కారు దృష్టి

మహబూబ్ నగర్, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ప్రాజెక్టులపై రాష్ట్ర సర్కారు దృష్టి సారించింది. ఏడాదిలోనే ముఖ్యమైన ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాలమూరు?రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి లిఫ్ట్ఇరిగేషన్ స్కీమ్తోపాటు కొత్తగా చేపట్టనున్న కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్పై అధికారులు దృష్టి సారించారు. పాలమూరు, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్లను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది., చాలా వరకు పనులు పెండింగ్లో ఉన్న నేపథ్యంలో వచ్చే ఏడాది డిసెంబర్వరకు టైం ఇవ్వాలని అధికారులు అడుగుతున్నట్టు తెలిసింది. డెడ్లైన్ను దృష్టిలో పెట్టుకొని అధికారులు వేగంగా చర్యలు చేపడుతున్నారు. ఇటు ఆర్డీఎస్, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులపైనా అధికారులు ఫోకస్ పెట్టారు. దీనిపై సోమవారం ఇరిగేషన్శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన కీలక ఫైళ్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఎక్కడెక్కడ పెండింగ్పనులున్నాయి? ప్రాజెక్టుల పనులకు ఏర్పడుతున్న అడ్డంకులేమిటి? లాంటి వివరాలను మంత్రికి అధికారులు అందించనున్నట్టు తెలిసింది. తెలంగాణ చరిత్రలోనే అత్యంత లేట్ అయిన ప్రాజెక్ట్.. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్. 1984లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే.. 2014లోగానీ పనులకు మోక్షం కలగలేదు. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ లిఫ్ట్ స్కీమ్లో భాగంగా 4.50 లక్షల ఎకరాలకు నీళ్లివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇంకా 1.74 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే పనులు పెండింగ్లో ఉన్నాయి. ఈ స్కీమ్లోని 29, 30వ ప్యాకేజీ పనులు పెండింగ్లో పడిపోయాయి. 29వ ప్యాకేజీలో భాగంగా 1.05 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లివ్వాలని టార్గెట్పెట్టుకున్నారు. అయితే, పలు చోట్ల 1,670 ఎకరాల భూములను ఇంకా సేకరించాల్సిన అవసరం ఉంది. అయితే, అందుకు చాలా చోట్ల రైతులు అడ్డుపడుతున్నారు. మరోవైపు సేకరించిన భూములకుగానూ రైతులకు గత ప్రభుత్వం పరిహారం సక్రమంగా ఇవ్వలేదన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు ఆ భూసేకరణ, పరిహారం విషయాలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఏర్పడింది. ఇటు 30వ ప్యాకేజీలో భాగంగా 14 వేల ఎకరాలు.. దానికి ఎక్స్టెన్షన్గా అచ్చంపేట బ్రాంచి కెనాల్ను 15 కిలోమీటర్ల మేర నిర్మించి, మరో 16 వేల ఎకరాలకు నీళ్లందించాల్సి ఉంది. ఈ పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా డెడ్లైన్ విధించారు. ఇదే ప్యాకేజీలో వనపర్తి జిల్లాలోనూ 49 వేల ఎకరాల ఆయకట్టుకూ నీళ్లిచ్చేందుకు పనులు చేపట్టాల్సి ఉంది. ఈ వర్క్ను 2025 డిసెంబర్ లేదా 2026 తొలి త్రైమాసికం నాటికి పూర్తి చేసేలా టార్గెట్పెట్టుకున్నారు. అందులో భాగంగానే వాటి పనులను పూర్తి చేసేందుకు వేగవంతంగా చర్యలు చేపడుతున్నారు. సీఎం రేవంత్రెడ్డి సొంత నియోజకవర్గంలో చేపడుతున్న కొడంగల్?నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్పైనా చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఆ ప్రాజెక్టు టెండర్లపై కసరత్తులు మొదలుపెట్టే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాల ద్వారా తెలుస్తున్నది. పాలమూరు?రంగారెడ్డి లిఫ్ట్ స్కీమ్కు 2015లో శంకుస్థాపన చేసినా.. ఇప్పటికీ పెండింగ్లోనే ఉన్నది. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ ప్రాజెక్టు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఈ ప్రాజెక్టులో రూ.15 లక్షల విలువైన పనులు పెండింగ్లో ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. మొత్తం 34 భారీ మోటార్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో నిరుడు సెప్టెంబర్లో గత ప్రభుత్వం తొలి మోటార్ను ప్రారంభించింది. నార్లాపూర్ పంప్హౌస్లోని తొమ్మిది పంపుల్లో ఒక మోటార్ను డ్రైరన్ చేశారు. పూర్తయిన ఫేజ్ కూడా జస్ట్ తాగు నీటి అవసరాల కోసం చేపట్టిన పనులే. అది తప్ప ఆ ప్రాజెక్ట్ను పూర్తి చేయడంలో గత సర్కార్ నిర్లక్ష్యం వహించింది. సాగునీటికి సంబంధించి ఏపీ కొర్రీలు పెడుతుండడంతో వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సర్కారు ప్రయత్నిస్తున్నది. ఈ ప్రాజెక్టును తొలుత 6 రిజర్వాయర్లుగా నిర్మించాలనుకున్నారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లలో నీటిని నింపుకొని, ఆయకట్టుకు నీళ్లివ్వాలని మొదట భావించారు. కానీ, ఆ తర్వాత గత సర్కారు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ను వద్దనుకున్నది. ఉద్దండాపూర్వరకు నిర్మించి నీటిని తరలించాలనుకుంది. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ను కట్టకుండా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లివ్వాలని గత ప్రభుత్వం యోచించిందని, అందుకే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ను పక్కనపెట్టిందని అధికార వర్గాలు చెప్తున్నాయి. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో అక్కడిదాకా కాదు కదా.. అసలు ఎంత వరకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోసుకోవచ్చో కూడా సందిగ్ధత ఏర్పడిందని, ఈ క్రమంలోనే ప్రస్తుత ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్నూ నిర్మించేందుకు నిర్ణయించిందని చెప్తున్నారు. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది డిసెంబర్నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

# ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

**-జిల్లా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో దంత సేవలు అందించాలి**

**-రోగులకు అందించే మందుల వివరాలు పూర్తి స్థాయిలో ఈ-అవషదీలో నమోదు**

పెద్దపల్లి: జిల్లా ఆసుపత్రి ప్రాంగణం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంక్, ఫార్మసీ విభాగం, కంటి వైద్య విభాగం, దంత వైద్య విభాగం, టాయిలెట్లు, జనరల్ వార్డ్ లను కలెక్టర్ పూర్తి స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉంటే వెంటనే తాత్కాలిక ప్రాతిపదికన నియామకం చేసేందుకు ఫైల్ పెట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఆసుపత్రి పారిశుధ్యం అంశంలో కొంత అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ రెగ్యులర్ గా టాయిలెట్లను శుభ్రం చేయాలని, ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైయినేజిలో ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సంబంధిత ఇంజనీర్లకు తెలియజేసి మరమ్మత్తు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి పారిశుధ్య కాంట్రాక్టర్ కు వెంటనే మెమో జారీ చేయాలని, పారిశుధ్య కార్మికులు రెగ్యులర్ గా వచ్చి ఆస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేయని పక్షంలో వారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఆసుపత్రి ఆపరేషన్ విభాగంలో అవసరమైన ఆప్తమాలజిస్ట్ మైక్రోస్కోప్ ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో ఇద్దరు దంత వైద్యులు అందుబాటులో ఉన్నందున జిల్లా ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రిలో దంత వైద్య సేవలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు అందించే మందుల చిట్టిలు, వారికి సరఫరా చేసిన మందుల వివరాలు పూర్తి స్థాయిలో ఈ- అవషదీలో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో రోగులకు అందించే డైట్ వివరాలను ఆర్.ఎం.ఓ రెగ్యులర్ గా మానిటర్ చేయాలని, రోగులకు ప్రతి రోజు గుడ్లు, నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆకస్మిక తనిఖీ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, వైద్య అధికారులు తదితరులు ఉన్నారు.

# సైబర్ నేరగాల్లతో రైతులు మోసపోవద్దు

### పెద్దమందడి ఎస్,ఐ శివ కుమార్ యాదవ్



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, జూలై 18 (తీన్మార్ న్యూస్): పంట రుణమాఫీ సంబంధించిన డబ్బులు రైతు ఖాతాలో జమ అయ్యేందుకు బ్యాంకు వివరాలు తెలపాలని సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతుంటారు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం పెద్దమందడి ఎస్ఐ శివకుమార్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండాలని,రైతులకు పలు సూచనలు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీని అడ్డుపెట్టుకొని సైబర్ నేరగాళ్లు రైతు ఖాతాలో డబ్బు కట్ చేస్తారని అన్నారు ఏదో ఒక బ్యాంక్ పేరిట వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్ లోగోతో షేక్ యాప్ తయారు చేసి ఏపీకె ఫైల్స్ ను వాట్సఅప్ గ్రూప్ లోకి పంపించి వాటి గురించి తెలియని వారు ఓపెన్ చేయరాదని పలు సూచనలు రైతులకు అవగాహన కల్పించారు మీ బ్యాంకులో రుణమాఫీ వేయాలని ముందుగా ఈ అకౌంట్లో పదివేల రూపాయలు వేయాలని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడతారని ఎవరైనా సైబర్ మోసగాళ్లు ఫోన్ చేస్తే బ్యాంకు కి వెళ్తామని చెప్పాలని రైతులకు వివరించారు అప్రమత్తంగా లేకుంటే మీ అకౌంట్లో డబ్బులు కాళీ అవుతాయి అన్నారు సైబర్ మోసగాళ్లకు ఎలాంటి మోసపోకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

# దేవాదాయ భూముల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**- దేవాదాయ, ధర్మాదాయ శాఖ భూముల వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం పాలసీలపై పునరాలోచించాలి.**

**- దేవాదాయ భూములపై బిఆర్ఎస్ ప్రభుత్వ వైఖరినే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుంది**

**- బిజెపి సీనియర్ నాయకులు పేరాల శేఖర్ రావు**

హైదరాబాద్ జూలై 18: హిందూ దేవలయాలు, హిందూ ఆధ్యాత్మికత విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ సర్కారు అక్రమ మార్గాల్లో వెళ్తోందని బిజెపి సీనియర్ నాయకులు పేరాల శేఖర్ రావు పేర్కొన్నారు. దేవాదాయ భూముల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,దేవాదాయ, ధర్మాదాయ శాఖ భూముల వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం పాలసీలపై పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేసారు. బిజెపి రాష్ట్ర కార్యాలయం పార్టీ ఉపాధ్యక్షులు ఎన్విఎస్ఎస్ ప్రబాకర్, పార్టీ అధికార ప్రతినిధులు ఎన్వి సుబాష్,సునీత రెడ్డి లతో కలిసి మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపురం గ్రామంలోని సీతారామస్వామి ఆలయానికి సంబంధించి 1148 ఎకరాల భూమిని గత ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి వ్యాపార సంస్థలకు దారాధత్తం చేసిందని తిలిపారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ఆలయానికి చెందిన భూములను దారాదత్తం చేస్తోందని,ప్రభుత్వానికి అస్మదీయులుగా ఉన్న వ్యాపారులకు అత్యంత విలువైన ఆలయ భూములను, అత్యంత చౌకధరకు కట్టబెట్టడం అన్యాయ మన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ వ్యవహారాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పాలసీలపై పునరాలోచించాలని డిమాండ్ చేసారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కోట్ల రూపాయల విలువైన ఆలయ భూములను ఎకరానికి రూ. 10 లక్షల చొప్పున కట్టబెట్టింది. ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వ భూములను ఇతర సంస్థలకు ఇవ్వాలనుకున్నపుడు ఓపెన్ యాక్షన్ ద్వారానే ఇవ్వాలనే నిబంధన ఉందని,ఆలయ భూముల అమ్మకంపై ఉత్తర్వుల ప్రకారమే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు చెప్పినప్పటికీ అయినా రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యాపార సంస్థలకు దారాధత్తం చేస్తోందని విమర్శించారు. ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్ మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 75 ఎకరాలు, ఎస్.ఎస్ ఇకో కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 10 ఎకరాల ఆలయ భూములను ప్రభుత్వం ఇచ్చిందని తిలిపారు. తెలంగాణలో ఆలయ భూములను వ్యాపార సంస్థలకు నిబంధనలను అతిక్రమించి దారాధత్తం చేయడం అన్యాయమని, దేవాలయాల భూములను కారుచౌకగా ఇచ్చే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. ప్రభుత్వ తీరు ఇలానే కొనసాగితే.. భక్తులు దేవాలయాలకు ఆస్తులు ఇచ్చే పరిస్థితి ఉండదు. ఇప్పటికైనా భూముల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

### వీధికుక్కల దాడిలో మరో చిన్నారి మృతి

మేడ్చల్: మేడ్చల్ జిల్లా జవహర్ నగర్లో మంగళవారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. వీధికుక్కల దాడిలో ఏడాదిన్నర బాలుడు మరణించాడు. ఇంటి బయట ఆడుకుంటున్న బాలుడిపై ఎగబడ్డ కుక్కలు. కొంతదూరం ఈడ్చుకెళ్లి మరీ దాడి చేశాయి. ఈ ఘటనలో మెదడులో కొంత భాగం కూడా బయటపడింది. దీంతో తీవ్రగాయాలైన బాలుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... సిద్దిపేట జిల్లా మిరిదొడ్డి గ్రామానికి చెందిన భరత్-లక్ష్మీ దంపతులకు విహాన్ అనే ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు. పని కోసం, బతుకుదామని నెల కిందట హైదరాబాద్కు వచ్చారు. జవహర్నగర్లోని ఆదర్శ్ నగర్లో నివాసం ఉంటున్న లక్ష్మీ సోదరుడి ఇంట్లోనే ఉంటున్నారు. రాత్రి 7 గంటల సమయంలో విహాన్ ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. అప్పుడే గుంపులుగా వచ్చిన వీధికుక్కలు ఒక్కసారిగా విహాన్పై దాడి చేశాయి. కుక్కల దాడిలో విహాన్ మరణించడం స్థానికంగా కలకలం సృష్టించింది. జవహర్నగర్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని.. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు సమస్యను పట్టించుకోలేదని, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# బీఆర్ఎస్ లో మిగిలేది ఎంత మంది

హైదరాబాద్, : బీఆర్ఎస్‌లో మిగిలేది ఎంత మంది? ఒకప్పటి అదే బీఆర్ఎస్ నేత అయిన దానం నాగేందర్ మాటల్లో చెప్పాలంటే.. ముగ్గురు లేదా నలుగురు. ఈ ఫిరాయింపులకు సంబంధించి న్యాయపోరాటం చేసుకోండని ఆయన సవాల్ కూడా విసురుతున్నారు. ఆయన ఇంతలా ఎందుకు రియాక్ట్ అవుతున్నారు? నిన్న మొన్నటి వరకు ఒకే పార్టీలో ఉన్న నేత ఇంత ఘాటుగా రియాక్ట్ అవ్వడానికి రీజనేంటి? సింపుల్..

ఆత్మగౌరవం దెబ్బతినడం. ఎమ్మెల్యేలమైనా మమ్మల్ని కనీసం మనుషులుగా కూడా ట్రీట్ చేయలేదు. ఓ చీడ పురుగును చూసినట్టు చూశారు. అందుకే చాలా మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధంగా ఉన్నారని బల్లగుద్దీ మరీ చెబుతున్నారు. నిజానికి పరిస్థితులు చూస్తుంటే ఆయన మాటలు నిజమయ్యేలానే ఉన్నాయి.మరికొన్ని గంటల్లోనే గ్రేటర్ ఏరియాలోని అన్ని నియోజకవర్గాల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే వీరంతా బీఆర్ఎస్ పార్టీ మీటింగ్స్‌కు మొఖం చాటేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పాలకమండలి మీటింగ్‌కు కూడా డుమ్మా కొట్టారు.దీంతో గులాబీ పార్టీలో గుబులు రేపుతోంది. ఇప్పటికే దెబ్బ మీద దెబ్బలా నేతల వలసల షాక్ తగులుతోంది. ఇప్పుడు జరగబోయే పరిణామాలను చూసేందుకు బీఆర్ఎస్ పెద్దలు గుండెను రాయి చేసుకోవాల్సిన అవసరం ఉంది. నిజానికి ఈ నెలాఖరు వరకు ఈ చేరికలను పూర్తి చేయాలన్నది కాంగ్రెస్ టార్గెట్.. ఆలోపు బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేయాలని కాంగ్రెస్ ఆలోచన. ఇప్పుడు పరిస్థితులు చూస్తుంటే అంతకుముందే కాంగ్రెస్ ఈ టార్గెట్‌ను రీచ్ అయ్యేలా కనిపిస్తోంది.కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ.. అంబర్ పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్.. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మార్రి రాజశేఖర్ రెడ్డి..సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్.. ఈ లిస్ట్‌లో ఉన్న ఒకరిద్దరు తప్ప.. అందరి దారి కాంగ్రెస్ వైపే అన్నట్టుగా కనిపిస్తోంది. ఇప్పటికే మాజీ మంత్రి తలసానికి కూడా పార్టీలో చేరమని రాయబారం వెళ్లినట్టు తెలుస్తోంది. మరి ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి. మొత్తానికి కార్పొరేషన్ ఎన్నికల నాటికి గ్రేటర్ ఏరియాలో బలపడాలన్నది కాంగ్రెస్ ఆలోచన.. పరిణామాలు చూస్తుంటే బలపడే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.ఇది గ్రేటర్ విషయం.. ఇక స్టేట్‌వైడ్‌గా చూసుకుంటే.. బీఆర్ఎస్‌కు ఉన్న ఎమ్మెల్యేలలో 26 మంది ఎమ్మెల్యేలను చేర్చుకోవాలని చూస్తోంది కాంగ్రెస్.. అందుకే అడుగులు వేగంగా వేస్తోంది. అయితే ఈ చేరికలపై బీఆర్ఎస్ కూడా గట్టిగానే పోరాడుతోంది. స్పీకర్‌కు లేఖలు రాస్తూ.. కోర్టులను కూడా ఆశ్రయిస్తుంది. బట్ ఎలాంటి ఫలితం లేదు. ఎందుకంటే ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ఎల్పీ విలీనమవుతుందన్న క్లారిటీ వచ్చింది. దీంతో ఎలాంటి భయం లేకుండా కాంగ్రెస్‌లో చేరిపోతున్నారు.పార్టీ ఆపద సమయంలో ఉంటే కనీసం కాపాడుకోవడానికైనా ప్రయత్నించాల్సిన పెద్దలు.ఒకరు ఫామ్‌హౌస్‌కే పరిమితం కాగా.. మరో ఇద్దరు ఢిల్లీలో కవిత బెయిల్ కోసం కాళ్లబేరాలు, రాయబారాలతో బిజీగా ఉన్నారు. దీంతో కాంగ్రెస్‌కు పని మరింత ఈజీగా అయిపోయింది.

# తెరపైకి ప్రోటోకాల్ రచ్చ

హైదరాబాద్, తెలంగాణలో ప్రోటోకాల్ ఫైట్ స్టార్ట్ అయ్యింది. ప్రోటోకాల్ పాటించలేదని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిరసనకు దిగడం హాట్ టాపిక్‌గా మారింది. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితను స్టేజ్‌పైకి పిలవకుండా.. ఓడినవారిని పిలవడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. ఎమ్మెల్యేల హక్కులను కాలరాస్తున్నారంటూ అధికారపార్టీపై నిప్పులు చెరిగారు.ప్రోటోకాల్ ఇష్యూపై ఘాటుగా రియాక్ట్ అయ్యారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అధికార కాంగ్రెస్.. ఎమ్మెల్యేల హక్కులను కాలరాస్తోంది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందంటూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కి బహిరంగ లేఖ రాశారాయన. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాలరాస్తూ ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. శాసనసభ్యుల హక్కులను ఉద్దేశపూర్వకంగా రేవంత్ సర్కార్ ఉల్లంగిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేల హక్కులు, ప్రోటాకాల్ ఉల్లంఘనలు జరగకుండా అడ్డుకోవాలి స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు సీఎస్, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.అవసరమైతే ఈ అంశాన్ని అసెంబ్లీ సమావేశాల్లో కూడా లేవనెత్తుతామన్నారు కేటీఆర్.రాష్ట్రంలో ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఇటు మాజీ మంత్రి హరీష్ రావు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల హక్కులను కాలరాయడానికి మీరెవరంటూ నిప్పులు చెరిగారు. ఎమ్మెల్యే అయిన మహిళా ప్రజాప్రతినిధికి ఇందిరమ్మ రాజ్యంలో గౌరవం లేదా..? ప్రజలు గెలిపించిన నాయకులకు విలువ లేదా..? ఎమ్మెల్యేగా గెలిచిన మనిషిని విస్మరించి, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తికి అధికార యంత్రాంగం సలాం కొట్టడం ఏమిటి..? అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్న ఆయన.. ప్రోటోకాల్ విషయంలో ప్రజాప్రతినిధులకు జరుగుతున్న అవమానం పట్ల స్పీకర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలా రాష్ట్రంలో లేటెస్ట్‌గా ప్రోటోకాల్ రగడ నడుస్తోంది. ఎమ్మెల్యే సబిత ప్రోటోకాల్ ఘటనపై బీఆర్ఎస్ నేతలు నిప్పులు కక్కుతున్నారు. మరి ఇష్యూ ఇంకెంత దూరం వెళ్తుందో చూడాలి

# గొర్రెల స్కామ్ లో కేటీఆర్ పీఏ ?

కరీంనగర్, బీఆర్ఎస్ హయాంలో జరిగిన స్కాములపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. వాటిలో ముఖ్యంగా గొర్రెల స్కాంపై ఏసీబీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే మాజీ మంత్రి కేటీఆర్ పీఏ తిరుపతి లింక్స్ బయటకు వచ్చినట్టు సమాచారం. 700 కోట్ల స్కాంలో తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా ఎక్కడ దొరికితే అక్కడ దోచేశారు. మంత్రి తలసాని ఓఎస్డీ కళ్యాణ్ కుమార్, సీఈఓ రాంచందర్ అరెస్ట్ తర్వాత కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. అందుకు కళ్యాణ్ కుమార్ డేటా లిస్టులో తిరుపతి పేరు ఉండటం కేటీఆర్ వర్గాన్ని కలవరపెడుతోందిసిరిసిల్ల జిల్లాకు చెందిన రాజు అనే కాంట్రాక్టర్‌కి అప్పగించడంలో తిరుపతి పాత్ర చాలా ఉందని ఏసీబీ అధికారులు డేటా సేకరించారు. అయితే, డబ్బులు ఎంత చేతులు మారాయి. ఒక్క సిరిసిల్లలోనే వేలు పెట్టాడా? తన సొంత జిల్లా అయిన జగిత్యాలలో కూడా స్కాంకు సహకరించాడా అనేది అధికారులు ఆరా తీస్తున్నారు. మొత్తం కోటి రూపాయలకు పైగా అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే, ఆ లబ్ధిదారుల వివరాలు, అడ్రస్, ఫోన్ నెంబర్స్‌తో పాటు బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నారు. జిల్లాల వారీగా లబ్ధిదారులకు అమ్మిన యజమానుల డేటాలో డబ్బులు ఎలా చేరాయి. మళ్లీ వీరి ఖాతాలోకి ఎలా వచ్చాయో పూర్తి వివరాలు ఉన్నట్లు సమాచారం. గొర్రెల కాంట్రాక్టర్ రాజు నుంచి ఇతనికి డబ్బులు చేరిన విషయాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది.కేటీఆర్‌కు అన్నీ తానై చూసుకునే తిరుపతికి చివాట్లు పెట్టినట్లు అత్యంత సన్నిహితులు చెబుతున్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు తనకు తెలియకుండా ఇంకా ఏం చేశారోనని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. గొర్రెల స్కాంలో డబ్బులు తినడంపై తనకు చెడ్డపేరు వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. గతంలో గ్రూప్ 1 లీకేజీ విషయంలో తిరుపతి తీరుపై అనుమానాలు ఉన్నాయి. అప్పుడు వాళ్ల ప్రభుత్వమే ఉండటంతో కప్పిపుచ్చుకున్నారని, ఇప్పుడు ఒక్క కేసులో నిందితుడిగా మారితే తవ్వేకొద్దీ అక్రమాలు, అవినీతి బయటపడే అవకాశాలు ఉన్నాయంటున్నారు.కేటీఆర్ పేరు చెబుతూ గతంలో ఓఎస్డీ మహేందర్ రెడ్డి అధికారులపై పెత్తనం చెలాయించారు. ఫైల్స్ క్లియరెన్స్‌కి ఓ లెక్క ఉండేదని చెబుతుంటారు. కంఫర్డ్ ఐఏఎస్ ఇంటర్వ్యూల ఫైల్‌లో కూడా ఇన్వాల్ అయి ఆయన పాత్ర ఏంటో నిరుపించుకున్నారు. ఇప్పుడు తిరుపతి కూడా స్కాముల్లో ఇరుక్కుంటాడని తెలుస్తుండటంతో కేటీఆర్ జాగ్రత్తలు తీసుకునే పనిలో ఉన్నట్లు సమాచారం.

# పప్పులు...కసిగా పని చేసి...

హైదరాబాద్, పప్పు? రాజకీయాల్లో కొన్ని రోజులుగా వినిపించిన పదం ఇది.. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అధికార బీజేపీ నాయకులు పప్పు అని సంబోధిస్తూ గేలి చేశారు. వారసత్వ రాజకీయాలు చేస్తున్నారని, రాజకీయ పరిణతి లేదని, పార్టీని గెలిపించే లక్షణాలు లేవని విమర్శించారు. ప్రధాని నరేమంద్రమోదీ సైతం రాహుల్‌ను పప్పు అని సంబోధించారు. ఇక ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయకుడు తనయుడు మంత్రి నారా లోకేష్‌ను కూడా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు పప్పు అని ఎగతాళి చేశారు. తెలుగు పదాలు పలకడం కూడా రాదని గేళి చేశారు. రాజకీయాలకు పనికిరాడని ఎద్దేవా చేశారు. ఇద్దరు నేతలు ఐదేళ్లు ఈ అవమానాలను భరించారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోలేదు. కానీ, అధికారంలో ఉన్నామన్న అహంకారంతో అటు బీజేపీ, ఇటు వైసీపీ నాయకులు రాహుల్‌గాంధీని, లోకేశ్‌ను ఉద్దేశించి నేసిన ఎగతాళిని ప్రజలు పట్టించుకున్నారు.2019 నుంచి 2024 వరుకు రాహుల్‌గాంధీపై పప్పు అనే విమర్శలు తీవ్రమయ్యాయి. ముఖ్యంగా 2019 ఎన్నికల సమయంలో రాహుల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన సారథ్యంలో పార్టీ ఘోరంగా ఓడిపోయింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకలేదు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసిన రాహుల్‌గాంధీ ఒకస్థానంలో ఓడిపోయారు. ఇదే సమయంలో బీజేపీ సింగిల్‌గా 2014 కన్నా ఎక్కువ సీట్లు సాధించింది. ఇదే బీజేపీ నేతలకు అధికారం తలకెక్కేలా చేసింది. దీంతో రాహుల్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈఇక ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్లిన ప్రధాని మోదీ సైతం రాహుల్‌పై పప్పు అని ఎగతాళి చేశారు. వివిధ 'దళ్ (ఫ్రంట్లు)' 'దాల్?దాల్' తప్ప మరొకటి కాదన్నారు. ఇక కేంద్ర మంత్రులు, ఇతర నాయకులు అయితే ఇష్టానుసారం రాహుల్ గాంధీ గురించి మాట్లాడారు..ఇదిలా ఉంటే.. గత అనుభవాలను, విమర్శలను, ఎగతాళిని రాహుల్ ఛాలెంజ్‌గా తీసుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కసిగా పనిచేశారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని, బీజేపీని ఓడించాలన్న కసి పెంచింది. దీంతో రాహుల్‌ను పాదయాత్రకు ప్రేరేపించాయి. గతంలో దేశంలో ఏ నాయకుడు చేయనట్లుగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. తెలంగాణ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేశారు. నాయకులను ఏకతాటిపైకి తెచ్చారు. ఫలితంగా 2024లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేలేకపోయినా ప్రతిపక్ష హోదా తీసుకొచ్చారు. పరిణతి గల నేతగా ఎదిగారు.ఇక 20219 అసెంబ్లీ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఘోరంగా ఓడిపోయింది. ఈ ఎన్నికల్లో చంద్రబాబు కొడుకు నారా లోకేశ్ మంగళగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో వైసీపీ 151 సీట్లతో అధికారంలోకి వచ్చింది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన వైసీపీ టీడీపీని చిన్నచూపు చూడడం మొదలు పెట్టింది. విపక్ష నేత చంద్రబాబుతోపాటు ఆయన కొడుకు లోకేశ్ టార్గెట్‌గా విమర్శలు చేసింది. లోకేశ్‌ను అయితే నాయకుడిగా కూడా పరిగణించలేదు. ఎమ్మెల్సీగా ఉన్నా.. ఆయనకు గౌరవం ఇవ్వలేదుకానీ లోకేశ్ విమర్శలను పెద్దగా పట్టించుకోలేదు. ఆయనలో వైసీపీ విమర్శలు కసిని పెంచాయి. దీంతో ఎన్నికల సమయంలో లోకేశ్ సైతం పాదయాత్ర చేశారు. యువ గళం పేరుతో పాదయాత్ర ప్రారంభించారు. ఆయన పర్యటన సందర్భంగా కూడా వైసీపీ నాయకులు తీవ్రంగా ఎగతాళి చేశారు. మాటల తడబాటును సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. పాదయాత్ర వెంట ఎవరూ లేరని విమర్శించారు.

కానీ, అయినా లోకేశ్ పట్టుదలతో ముందుకు సాగారు. పార్టీని బలోపేతం చేశారు. 2024 ఎన్నికల్లో అదే మంగళగిరి నుంచి లోకేశ్ గెలవడమే కాకుండా.. టీడీపీ కూటమి ఏపీలో వైసీపీని మించిన సీట్లు సాధించి అధికారంలోకి వచ్చింది.

# మెట్రో ప్లాన్.... రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలకు రెక్కలు

హైదరాబాద్, ఎల్బీనగర్-హయత్‌నగర్ మెట్రో కల.. త్వరలోనే సాకారం కానుంది. మరోవైపు హయత్‌నగర్ మెట్రో ప్లాన్‌తో.. రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. తొలుత ఐటీ కంపెనీల రాకతో భూముల విలువ అమాంతం పెరిగింది. ఇక రీజినల్ రింగ్ రోడ్డు వల్ల జిల్లాలో భూములు బంగారం అవుతాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అయితే ఎక్కడా లేనివిధంగా 100 కోట్ల రూపాయలు పలుకుతున్న భూమి కేవలం ఈ జిల్లాలోనే ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

హయత్ నగర్‌కు మెట్రోతో.. రంగారెడ్డి జిల్లాకు మహర్దశ పట్టబోతోంది. మెట్రో రైలు విస్తరణకు సంబంధించి అన్ని ప్రణాళికలు పూర్తయ్యాయి. సైబరాబాద్‌ను న్యూయార్క్‌తో పోటీపడేలా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే శివారు ప్రాంతాల్లో ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇక ప్రఖ్యాతిగాంచిన రామోజీ ఫిలింసిటీ సైతం ఇక్కడే ఉండటంతో పర్యాటకులకు, సినిమా వాళ్లకు మెట్రో ఎంతో ఉపయోగపడుతుంది. రాచకొండ ప్రాంతాన్ని అద్భుతమైన ఫిలిం ఇండస్ట్రీగా మారుస్తామని సీఎం హామీ ఇచ్చారు.హయత్‌నగర్ మెట్రో ప్లాన్ ఎప్పటి నుంచో ఉంది. ఎల్బీనగర్ వరకే మెట్రో ఉండటంతో అక్కడి నుంచి వెళ్లాలంటే ట్రాఫిక్ కష్టాలు దారుణంగా ఉన్నాయి. ఎందుకంటే.. మెట్రో దిగాక బస్సు ఎక్కాలంటే చాలా దూరం నడిచి ముందుకు రావాల్సి వస్తోంది. అంతేకాకుండా 4 రోడ్ల కూడలి వల్ల వాహనాల రద్దీతో నడిచి వెళ్లాలంటే కష్టంగా ఉంటోంది. అందులోనూ హయత్‌నగర్‌లో మధ్యతరగతి వాళ్లు, కూలీ పనులకు వెళ్లేవాళ్లు ఉండేందుకు అనువుగా ఉంటుంది. సో చాలా మంది అక్కడి నుంచే సిటీకి వెళ్తుంటారు. ఒక్కోసారి ఆటోలు, బస్సులు అందుబాటులో లేక నానా అవస్థలు పడుతున్నారు. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకున్న రేవంత్ సర్కార్ వీలైనంత త్వరగానే మెట్రో పూర్తి చేసేలా ప్లాన్ చేస్తోంది.

# బదిలీలు... పైరవీలు

అదిలాబాద్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీ ప్రక్రియ మొదలుకావడంతో అంతేస్థాయిలో పైరవీలు జోరందుకున్నాయి. మరో మూడు రోజుల్లో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ రానుండడంతో తాము కోరుకున్న చోటుకు ట్రాన్స్‌ఫర్ అయ్యేందుకు ఆఫీసర్లు, ఉద్యోగులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వివిధ డిపార్ట్‌మెంట్లలో దీర్ఘకాలంగా పాతుకుపోయిన మరికొందరు అక్కడి నుంచి కదలడానికి కూడా ఇష్టపడడం లేదు. ఈ క్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులను, ప్రజాప్రతిధులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. 'సార్.. మీరు చెప్పినట్టు వింటాం... మీకు అనుకూలంగా పనిచేస్తాం' అంటూ ఇప్పటికే కొంతమంది పైరవీ లెటర్లు సంపాదించినట్టు సమాచారం. రాష్ట్రంలో ఉద్యోగుల సాధారణ బదిలీలపై ఐదేండ్లుగా కొనసాగుతున్న నిషేధాన్ని ఇటీవల ప్రభుత్వం ఎత్తి వేసింది. ఈ నెల 5 నుంచి 20లోగా బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం 5 నుంచి 8 వరకు బదిలీలకు అర్హులను, కేటగిరీల వారీగా ఖాళీలను ప్రకటించారు. 9 నుంచి 12 వరకు ఉద్యోగుల నుంచి ఆప్షన్లు తీసుకున్నారు. 13 నుంచి 18 వరకు అప్లికేషన్లను పరిశీలించి మాస్టర్ లిస్ట్‌ను తయారు చేస్తారు. 19, 20 తేదీల్లో ఉద్యోగులకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు జారీ కానున్నాయి. బదిలీ అయిన ఉద్యోగులు మూడు రోజుల్లో ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ అయి కొత్త పోస్టింగ్‌లో చేరాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలు, జోన్లు, మల్టీజోన్లు, రాష్ట్ర స్థాయి కేడర్లకు సంబంధించిన కసరత్తు జరుగుతోంది. అటెండర్లు, రికార్ట్ అసిస్టెంట్లు, టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు జిల్లా పరిధిలో బదిలీ కానున్నారు. జోన్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లు, గ్రేడ్ 1, 2, 3 పంచాయతీ సెక్రటరీలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెన్నీషియన్లు, వెటర్నరీ అసిస్టెంట్లు జోన్ పరిధిలోని జిల్లాలకు బదిలీ కానున్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఎస్‌డబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, ఏటీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ సివిల్ సర్జన్లు మల్టీ జోన్ పరిధిలోకి వస్తారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా అధికారులతో పాటు సివిల్ సర్జన్లు, డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లు బదిలీ అయ్యే అవకాశం ఉంది.ఆయా డిపార్ట్‌మెంట్లలో 40 శాతం మంది ఆఫీసర్లు, ఉద్యోగులు మాత్రమే ట్రాన్స్‌ఫర్ కానున్నారు. ఒక స్థానంలో నాలుగు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ చేయాలన్న ఆదేశాలు ఉన్నాయి. రెండేండ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారు కోరుకున్న చోట ఖాళీలుంటే బదిలీ చేయవచ్చు. అయితే 40 శాతం బదిలీలను ఆసరాగా చేసుకొని కొంతమంది అధికారులు, సిబ్బంది తాము కోరుకున్న చోటుకు ట్రాన్స్‌ఫర్ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జోన్, మల్టీ జోన్ పరిధిలో సొంత ప్రాంతాలకు దూరంగా పనిచేస్తున్న వారు తమ స్వస్థలాలకు దగ్గరగా వెళ్లాలని కోరుకుంటున్నారు. ఆర్థిక లావాదేవీలు, ఆదాయం వచ్చే శాఖల్లో పనిచేస్తున్న మరికొందరు మాత్రం ప్రస్తు స్థానాల నుంచి కదలడానికి ససేమిరా అంటున్నారు. కోరుకున్న స్థానాలకు బదిలీ అయ్యేందుకు కొంతమంది అధికారులు, ఉద్యోగులు జోరుగా పైరవీలు సాగిస్తున్నారు. ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు రావడానికి మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉండడంతో తమకు అనుకూలమైన పోస్టింగ్ సాధించుకునేందుకు ఉన్నతాధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల లీడర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నికలతో సంబంధం ఉన్న శాఖల్లో పని చేస్తున్నవారు ఇప్పటికే ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. వారిలో కొందరు పాత స్థానాలకు రావడానికి ట్రై చేస్తున్నారు. మరికొందరు బదిలీలను తప్పించుకునేందుకు ఇతర శాఖల్లోకి డిప్యూటేషన్‌పై వెళ్లారు. అటెండర్ నుంచి అధికారి వరకు ఒకే జిల్లాలో పనిచేస్తున్న వారు చాలామంది ఉన్నారు. ఇలాంటి వారందరికీ ట్రాన్స్‌ఫర్లు తప్పనిసరి కావడంతో టెన్షన్ పడుతున్నారు. కొంతమంది బదిలీలను తప్పించుకోవడానికి దారులు వెతుకుతున్నారు.

# రేషన్ కార్డులకు రుణమాఫీకి లింకా..?

హైదరాబాద్, రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయలేదు. కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వలేదు. దీంతో సుమారు 10-12 లక్షల మంది కొత్త రేషన్‌కార్డులు, మార్పుల కోసం ఎదురు చూస్తున్నారు. రేషన్‌కార్డులకు సంబంధించి రాష్ట్రంలో పరిస్థితి ఈ విధంగా ఉంటే ప్రభుత్వం మాత్రం రుణమాఫీకి రేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో లక్షల మంది అర్హులు కూడా రుణమాఫీకి అనర్హులుగా మిగిలిపోయే ప్రమాదం ఏర్పడింది. కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులను గుర్తించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రాష్ట్రంలో ప్రస్తుతం 90 లక్షల తెల్లరేషన్‌కార్డులు ఉండగా ఇందులో 2.81 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. అయితే కొన్నేండ్లుగా రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. అదేవిధంగా కుటుంబ సభ్యులను చేర్చడం, తొలగించే అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో కొత్తగా పెండ్లి అయినవారు, కుటుంబం నుంచి వేరుపడినవారు కొత్త కార్డులు, మార్పుల కోసం ఎదురుచూస్తున్నారు. వీళ్లకు గతంలో అవకాశం లేకపోవడం, ఇప్పుడు కూడా అవకాశం రాకపోవడంతో అర్హులైనప్పటికీ రేషన్‌కార్డు దక్కలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వం రుణమాఫీకి రేషన్‌కార్డు లింకు చేయడంతో వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొత్త రేషన్‌కార్డు లేకపోవడంతో అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ పొందలేకపోతున్నారు.వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు అన్ని పథకాలకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని అమలు చేస్తున్నది. దీనిపై గతంలోనే విమర్శలొచ్చాయి. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకుండా పథకాలకు రేషన్‌కార్డును లింకు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

దీంతో ప్రభుత్వం త్వరలోనే కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. కానీ, అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కొత్త కార్డుల జారీకి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు కూడా కొత్త కార్డులు జారీ లేకుండా రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించి రేషన్‌కార్డును లింకు పెట్టింది. ఈ నేపథ్యంలో కొత్త కార్డులు ఇవ్వకుండా రుణమాఫీకి రేషన్‌కార్డును ఏవిధంగా లింకు చేస్తారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

# చరిత్ర సృష్టిస్తున్న ఐసీఏఆర్

న్యూఢిల్లీ, దేశంలో జనాభా రోజు రోజుకూ పెరుగుతోంది. పంటల సాగు విస్తీర?ణం తగ్గుతోంది. మరోవైపు వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో పంటల ఉత్పత్తి పెంపు కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) కృషి చేస్తోంది. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే వంగడాలను అభివృద్ధి చేస్తోంది. వ్యవసాయ అనుబంధ పారి, పశుసంవర్ధక రంగాల్లో అనేక పరిశోధనలు సాగిస్తోంది. ఈ క్రమంలో ఐసీఏఆర్ వంద రోజుల్లో వంద వంగడాలు, వంద వ్యవసాయ సాంకేతికతలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఒక శాస్త్రవేత్త, ఒక ఉత్పత్తి పేరుతో ఈమేరకు కార్యక్రమం చేపట్టింది.ఐసీఏఆర్ 96వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా తృణధాన్యాలు, నూనెగింజలు, మేత పంటలు మరియు చెరకుతో సహా 56 పంటలకు చెందిన 323 రకాలను విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించనుంది. ఈ వంగడాలు 289 రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా రూపొందించినట్లు వెల్లడించింది. ఈ 56 రకాల్లో 27 రకాలు బయో ఫోర్టిఫైడ్ రకాలు ఉన్నట్లు పేర్కొంది.కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్ మాట్లాడారు. ఐసీఏఆర్ సంస్థ పరిధిలోని మొత్తం 5,521 మంది శాస్త్రవేత్తలకు ఉత్పత్తి, సాంకేతికత, మోడల్, కాన్సెప్ట్ లేదా మంచి పబ్లికేషన్‌తో రావాలని లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. ప్రతీ సంవత్సరం ప్రారంభంలో, శాస్త్రవేత్త లేదా శాస్త్రవేత్తల బృందం ఉత్పత్తిని గుర్తించాలని తెలిపారు. ఐసీఏఆర్ శాస్త్రవేత్త లేదా సమూహం పనిని మ్యాప్ చేస్తుంది. ఇక ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఇనిస్టిట్యూట్ స్థాయిలో, ప్రతీ ఆరు నెలలకు ప్రధాన కార్యాలయ స్థాయిలో పర్యవేక్షిస్తారు. ఇది సుదీర్ఘ ప్రణాళిక అని తెలిపారు. ఈ పథకం ఐదేళ్లపాటు పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం అధిక దిగుబడినిచ్చే నూనెగింజలు, పప్పు ధాన్యాల రకాలకు సీడ్ హబ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.ఇదిలా ఉండగా ఐసీఏఆర్ 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 100 రోజుల్లో 100 కొత్త విత్తన రకాలు, 100 వ్యవసాయ సాంకేతికతలను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్ తెలిపారు. సెప్టెంబరు మధ్య నాటికి ఈ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఐసీఏఆర్ ప్రధాని నరేంద్ర మోదీని కోరుతుందని చెప్పారు.బ్రీడర్ విత్తనాల సహాయంతో సుమారు 16 మిలియన్ హెక్టార్లలో గోధుమ, 13 మిలియన్ హెక్టార్లలో వరి, 1.6 మిలియన్ హెక్టార్లలో పెర్ల్ మిల్లెట్ సహా వివిధ పంటల బయో-ఫోర్టిఫైడ్ రకాలు కింద ఉన్నాయని ఐసీఏఆర్ తెలిపింది. 2023-24లో పప్పు 0.50 మిలియన్ హెక్టార్లు, ఆవాలు 1.0 మిలియన్ హెక్టార్లలో సాగు చేసినట్లు వెల్లడించారు. వాతావరణ-తట్టుకునే సాంకేతికతల విస్తరణ అసాధారణ సంవత్సరాలలో కూడా మెరుగైన ఉత్పత్తి సాధించినట్లు తెలిపింది.ఇదిలా ఉంటే.. ఐసీఏఆర్.. 2014-15 నుంచి 2023-24 వరకు 2,593 అధిక దిగుబడినిచ్చే వివిధ రకాల వంగడాలను విడుదల చేసింది. వీటిలో బయోటిక్, అబియోటిక్ స్ట్రెస్ రెసిస్టెన్స్ కలిగిన 2,177 క్లైమేట్-రెసిస్టెంట్ రకాలు మరియు 150 బయో-ఫోర్టిఫైడ్ పంట రకాలు ఉన్నాయి.

# పారిస్ ఒలింపిక్స్.. మన మల్ల యోధులు పతక పట్టు పట్టగలరా?

### పట్టు పట్టేనా?
### 2008 నుంచి ప్రతి ఒలింపిక్స్‌లోనూ పతకం
### ఆరుగురు రెజ్లర్లపై భారీ ఆశలు
### మనదేశంలో అత్యంత ప్రాచీనమైన క్రీడగా గుర్తింపు ఉన్న రెజ్లింగ్‌కు భారత్‌లో ఘనమైన వారసత్వం ఉంది.




నాటి మహాభారత కాలం (మల్ల యుద్ధం) నుంచి నేటి 21వ శతాబ్ది దాకా ఈ క్రీడకు ఉన్న క్రేజ్ ఏమాత్రం చెక్కు చెదరలేదు. విశ్వక్రీడల్లో మనకు వ్యక్తిగత విభాగంలో తొలి పతకం అందించిన కేడీ జాదవ్ ఓ మల్ల యోధుడే. 2008 నుంచి జరుగుతున్న ప్రతి ఒలింపిక్స్‌లోనూ పతకం సాధిస్తూ మన దేశం పరువు నిలుపుతున్న క్రీడ కూడా ఇదే. ఈసారీ మనకు కచ్చితంగా మెడల్స్ వస్తాయని భారీ అంచనాలున్న క్రీడల్లో రెజ్లింగ్ కూడా ఒకటి. కానీ గడిచిన రెండేండ్లుగా భారత రెజ్లింగ్‌లో జరిగిన రచ్చ రెజ్లర్లను మానసికంగా దెబ్బతీసిన నేపథ్యంలో మన మల్ల యోధులు పతక పట్టు పట్టగలరా?

ఢిల్లీ: సుదీర్ఘ భారత ఒలింపిక్ చరిత్రలో మనదేశానికి వ్యక్తిగత విభాగంలో వచ్చిన తొలి పతకం రెజ్లింగ్‌దే. 1952లో హెల్సింకి(ఫిన్లాండ్) ఒలింపిక్స్‌లో రెజ్లర్ కేడీ జాదవ్ కాంస్యం గెలిచి చరిత్ర సృష్టించాడు. ఆ తర్వాత మళ్లీ 56 ఏండ్లకు గానీ ఈ క్రీడలో మనకు పతకం రాలేదు. 2008 బీజింగ్‌లో సుశీల్ కుమార్ కాంస్యం గెలిచాక నాటి నుంచి ప్రతి ఒలింపిక్స్‌లోనూ భారత్ పతకం నెగ్గింది. లండన్ (2012)లో సుశీల్ కాంస్యాన్ని రజతంగా మార్చాడు. అదే ఎడిషన్‌లో యోగేశ్వర్ దత్ కాంస్యం గెలుచుకోగా 2016 రియోలో సాక్షి మాలిక్ కాంస్యాన్ని తెచ్చింది. ఇక టోక్యోలో బజరంగ్ పునియా, రవి దహియా పతకాలతో సత్తా చాటి ఆ ఆనందాన్ని 'డబుల్' చేశారు. తాజాగా పారిస్‌లోనూ ఇవే ఫలితాలు రావాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఈసారి అమన్‌సెహ్రావత్, వినేశ్ ఫోగట్, అంతిమ్ పంగల్, అన్షు మాలిక్, నిషా దహియా, రీతికా హుడా రూపంలో ఆరుగురు రెజ్లర్లు బరిలో నిలిచారు.

అమన్ సెహ్రావత్ (50 కిలోలు)

ఈసారి పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ నుంచి కోటా దక్కించుకున్న ఏకైక పురుష రెజ్లర్ అమన్. 50 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో బరిలోకి దిగనున్న అమన్.. గత ఒలింపిక్స్ మెడలిస్ట్ రవి దహియా స్థానాన్ని భర్తీ చేస్తున్నాడు. అమన్ బలం అతడి సామర్థ్యం అంతకు తగ్గ ఓర్పు. ఆరు నిమిషాల పాటు బౌట్‌లో నిలిచాడంటే అమన్‌ను ఆపడం ఎవరితరమూ కాదు. అయితే వ్యూహాల అమలు, టెక్నిక్‌లో లోపంతో అతడు ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవల హంగేరి వేదికగా ముగిసిన ర్యాంకింగ్ సిరీస్‌లోనూ అది కొట్టొచ్చినట్టు కనిపించింది. ఒక వ్యూహం విఫలమైతే 'ప్లాన్ బీ' లేకపోవడం అతడికి మైనస్. ఉజ్బెకిస్థాన్ రెజ్లర్ల నుంచి అమన్‌కు కఠిన సవాల్ ఎదురుకానుంది.

వినేశ్ ఫోగట్ (50 కిలోలు)

భారత అత్యుత్తమ రెజ్లర్లలో ఒకరిగా ఉండే వినేశ్ బలం ఆమె డిఫెన్స్‌తో పాటు అంతే సమానంగా దూకుడుగా విరుచుకుపడే తత్వం. ఈ ఏడాది ఆమె ఆశ్చర్యకరంగా తన బరువు విభాగాన్ని 53 కిలోల నుంచి 50 కిలోలకు కుదించుకుంది. ఇదే ఆమెకు అతిపెద్ద సవాల్. గతేడాది రెజ్లర్ల పోరాటాన్ని ఆమె ముందుండి నడిపించింది. అప్పుడే ఆమె కెరీర్ ముగింపు దశకు చేరుకుందన్న వార్తలు వినిపించినా తర్వాత తనను తాను మెరుగుపరుచుకుని ఒలింపిక్స్ కోసం సిద్ధమైంది. వినేశ్‌కు ఇదే చివరి ఒలింపిక్స్‌గా భావిస్తున్న నేపథ్యంలో ఆమె ఈ అవకాశాన్ని ఏ మేరకు సద్వినియోగం చేసుకుంటుందనేది ఆసక్తికరం.

అన్షు మాలిక్ (57 కిలోలు)

జూనియర్ స్థాయిలో సంచలన విజయాలతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన అన్షు ఆ తర్వాత దానిని కొనసాగించలేకపోయింది. గాయాలు ఆమెను తరుచూ వేధించాయి. బౌట్ మొదలవగానే ప్రత్యర్థులపై దూకుడుగా అటాక్ చేయడం అన్షు బలం. టోక్యో ఒలింపిక్స్ సమయంలో ఆమెకు అంతగా అనుభవం లేకున్నా ఇప్పుడు ఆమె చాలా సీనియర్ ఈవెంట్స్‌లో పాల్గొని రాటుదేలింది. అయితే ఒలింపిక్స్‌కు ముందే ఆమె భుజం గాయంతో బాధపడిందని వార్తలు వచ్చినా దానిని ఆమె కొట్టిపారేసింది. దీంతో అన్షు ఫిట్‌నెస్‌పై అనుమానాలు తలెత్తుతున్నాయి.

అంతిమ్ పంగల్ (53 కిలోలు)

'ఫైర్‌బ్రాండ్ రెజ్లర్'గా గుర్తింపు దక్కించుకున్న ఈ యువ చిచ్చరపిడుగు భారత్ నుంచి పారిస్ కోటా దక్కించుకున్న తొలి రెజ్లర్. అంతిమ్ అతిపెద్ద బలం చురుకుతనం. ప్రత్యర్థుల పట్టు నుంచి ఆమె తేలికగా తప్పించుకుంటుంది. దూకుడు ఆమెకున్న సహజ లక్షణం. అయితే గాయం కారణంగా ఆమె ఆసియా క్రీడలతో పాటు గతేడాది ముగిసిన ఏషియన్ చాంపియన్‌షిప్‌లోనూ పాల్గొనలేదు. సరైన సన్నద్ధత లేకపోవడం ఆమెకు అతిపెద్ద మైనస్.

నిషా దహియా (68 కిలోలు)

అంచనాలే లేకున్నా పారిస్ బెర్తును దక్కించుకున్న నిషా దూకుడైన ఆట శైలికి పెట్టింది పేరు. బౌట్‌లో బెరుకు లేకుండా ఉండటం ఆమెకు కలిసొచ్చేదే. అయితే భారీ ఈవెంట్స్‌లో మాత్రం నిలకడగా రాణించకపోవడం ఆమె బలహీనత. బౌట్ మొదలైనప్పుడు దూకుడుగా ఉండే నిషా ఆ తర్వాత పట్టు కోల్పోతూ గతంలో చాలా మ్యాచ్‌లు చేజార్చుకుంది. బౌట్ చివరికి చేరుకునే సమయానికి ప్రత్యర్థికి పాయింట్లు సమర్పించుకుంటుంది. అంతర్జాతీయ స్థాయిలో ఈ బలహీనత వల్లే ఆమె స్టార్‌గా వెలుగొందలేకపోతోంది.

రితికా హుడా (76 కిలోలు)

ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తూ వారిని ఓడించడం రితికాకు వెన్నతో పెట్టిన విద్య. అనుభవజ్ఞులైన రెజ్లర్లను సైతం తన 'పట్టు'లో బంధించేస్తుంది. పవర్, టెక్నిక్ పుష్కలంగా ఉన్న రితికాకు బౌట్ చివరి నిమిషాల్లో పాయింట్లు సాధించే అలవాటు ఉంది. ఇదే క్రమంలో ఏకాగ్రత కోల్పోయి పాయింట్లను కోల్పోయే ప్రమాదమూ లేకపోలేదు.

ఆందోళనలతో 15 నెలలు బుగ్గి..

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నాడంటూ గతేడాది పలువురు మల్ల యోధులు చేసిన ఆందోళన దేశ క్రీడాచరిత్రలోనే ఓ సంచలనం. వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా ఆధ్వర్యంలో నడిచిన ఈ ఆందోళన.. దేశ పాలకులను సైతం కదిలించింది.

బ్రిజ్ భూషణ్‌ను తప్పించి కొత్త అధ్యక్షుడి నియామకం, ఆ తదనంతరం జరిగిన పరిణామాలు రెజ్లర్లను మానసికంగా దెబ్బతీశాయి. ఈ ఏడాది జనవరిలో ఎట్టకేలకు ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడ్డా.. సుమారు 15 నెలల పాటు దేశవ్యాప్తంగా ఎలాంటి టోర్నీ లేకుండా గడిపిన రెజ్లర్లు విశ్వక్రీడల్లో ఏ మేరకు సత్తా చాటగలరనేది ఈ ఆరుగురి ముందున్న అతిపెద్ద సవాలు.

# ఐదుగుర్ని అడిగితే ఒక్కరికే ఆమోదం.. గంభీర్ దూకుడుకు బీసీసీఐ కళ్లెం!



ముంబై: భారత క్రికెట్ జట్టుకు కొత్త హెడ్‌కోచ్‌గా నియమితుడైన గౌతమ్ గంభీర్ దూకుడుకు బీసీసీఐ ఆదిలోనే కళ్లెం వేస్తుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. కోచింగ్ స్టాఫ్ విషయంలో గంభీర్‌కు పూర్తి స్వేచ్ఛనిచ్చారనే వార్తలు గతంలో వినిపించినా అతడు సూచించిన ఐదుగురిలో ఒక్కరికి మాత్రమే ఓటు వేసినట్టు తెలుస్తోంది.

బౌలింగ్ కోచ్‌గా దక్షిణాఫ్రికా మాజీ బౌలర్ మోర్నీ మోర్కెల్, ఫీల్డింగ్ కోచ్‌గా జాంటీ రోడ్స్,రియాన్ టెన్ డొస్కటె పేర్లను ప్రతిపాదించగా బీసీసీఐ అందుకు సుముఖంగా లేదట. లక్ష్మీపతి బాలాజీ, వినయ్ కుమార్ పేర్లనూ బీసీసీఐ తిరస్కరించినట్టు వార్తలు వస్తున్నాయి. జహీర్ ఖాన్ వైపు బోర్డు మొగ్గుచూపుతున్నట్టు వినికిడి. ఇప్పటివరకూ గంభీర్ సూచించిన వారిలో ఒక్క అభిషేక్ నాయర్‌కు తప్ప మిగతా వారిని బీసీసీఐ తిరస్కరించినట్టు బోర్డు వర్గాల భోగట్టా.

## యూఎస్ ఓపెన్ మెయిన్ డ్రాకు నాగల్

ఢిల్లీ: ఈ ఏడాది ఆఖరి గ్రాండ్‌స్లామ్ అయిన యూఎస్ ఓపెన్‌లో భారత టెన్నిస్ సింగిల్స్ క్రీడాకారుడు సుమిత్ నాగల్ ఆడనున్నాడు. యూఎస్ ఓపెన్ బుధవారం విడుదల చేసిన మెయిన్ డ్రా జాబితాలో అతడు చోటు దక్కించుకున్నాడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 68వ ర్యాంకు దక్కించుకున్న నాగల్.. ఈ ఏడాది వరుసగా నాలుగు గ్రాండ్‌స్లామ్స్ ఆడనుండటం గమనార్హం. దీంతో 2019లో పి. గున్నేశ్వరన్ తర్వాత ఒక ఏడాది అన్ని గ్రాండ్ స్లామ్ ఈవెంట్స్‌లో పాల్గొననున్న తొలి ఆటగాడిగా నాగల్ నిలిచాడు.

# 140 కోట్ల మంది ఆశలు 117 మందిపై.. పారిస్‌కు వెళ్లేది వీళ్లే..

### పారిస్‌కు వెళ్లే క్రీడాకారుల జాబితాను ప్రకటించిన ఐవోఏ

ఢిల్లీ: మరో 8 రోజుల్లో మొదలుకాబోయే ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకాలు సాధించడానికి గాను భారత్ 117 మంది క్రీడాకారులను పారిస్‌కు పంపింది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) బుధవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది.

117 మంది అథ్లెట్లతో పాటు వారికి 140 మంది సహాయక బృందం పారిస్ వెళ్లనున్నారు. వీరిలో 72 మంది ఖర్చులను కేంద్ర క్రీడా శాఖ భరించనుంది. అథ్లెట్లలో షాట్ పుటర్ అభా ఖతువా పేరు లేదు. అయితే ఆమెను ఎందుకు పక్కనబెట్టిన విషయాన్ని మాత్రం ఐవోఏ వెల్లడించలేదు. క్రీడాకారుల జాబితాలో అథ్లెటిక్స్ నుంచి 29 మంది ఉండగా షూటింగ్ (21), హాకీ (19), టేబుల్ టెన్నిస్ (8), బ్యాడ్మింటన్




(7), రెజ్లింగ్ (6), ఆర్చరీ (6), బాక్సింగ్ (6), గోల్ఫ్ (4), టెన్నిస్ (3), స్విమ్మింగ్ (2), సెయిలింగ్ (2), ఈక్వెస్ట్రియన్, జూడో, రోయింగ్, వెయిట్ లిఫ్టింగ్ నుంచి తలా ఒక్కరు ఉన్నారు.

# భారత్ తొలి ప్రత్యర్థి పాకిస్తాన్

### రేపటినుంచి మహిళల ఆసియాకప్

ధంబుల్లా (శ్రీలంక): మహిళల ఆసియాకప్‌కు రంగం సిద్ధమైంది. మొత్తం 8జట్ల మధ్య జరిగే 2024 మహిళల ఆసియాకప్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. శ్రీలంక ఆతిథ్యమిస్తోన్న ఈ టోర్నమెంట్‌లో దంబుల్లా వేదికగా మొత్తం మ్యాచ్‌లు జరగనున్నాయి. గ్రూప్-ఎలో భారత్‌తోపాటు పాకిస్తాన్, యుఎఇ, నేపాల్%ా% గ్రూప్-బిలో శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా, థారులాండ్ జట్లు ఉన్నాయి. గ్రూప్ లీగ్ దశలో ఒక్కో జట్టు మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ చొప్పున ఆడనుంది. మూడు లీగ్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్ టాప్-2 జట్లు సెమీస్‌కు చేరనున్నాయి.

గ్రూప్-ఎలో టాప్‌లో నిలిచిన జట్టు గ్రూప్-బిలో రెండోస్థానంలో నిలిచి జట్టుతో, గ్రూప్-బిలో టాప్‌లో నిలిచిన జట్టు గ్రూప్-ఎలో రెండోస్థానంలో నిలిచిన జట్టుతో తలపడనున్నాయి. 2022లో బంగ్లాదేశ్ వేదికగా జరిగిన చివరి ఆసియాకప్‌లో భారతజట్టు విజేతగా నిలిచింది.




ఇప్పటి వరకు 8సార్లు మహిళల ఆసియాకప్ టోర్నీ జరగ్గా భారత్ ఏకంగా 7సార్లు విజేతగా నిలిచింది. 2018లో బంగ్లాదేశ్ ఫైనల్లో భారత్‌ను చిత్తుచేసి తొలిసారిగా విజేతగా నిలువగా.. భారత్ రన్నరప్‌తో సరిపుచ్చుకుంది.

# కుర్రాళ్ల నుంచి తీవ్ర పోటీ.. అప్పుడైనా సంజూ తుది జట్టులో కష్టమే: మిశ్రా

ఇంటర్నెట్ డెస్క్: ఇటీవల విరాట్ కోహ్లీపై సంచలన వ్యాఖ్యలతో భారత సీనియర్ స్పిన్నర్ అమిత్ మిశ్రా వార్తల్లో నిలిచాడు. ఈసారి సంజూ శాంసన్ టీ20 భవితవ్యంపై కామెంట్లు చేశాడు.

టీ20 ప్రపంచ కప్ 2024 జట్టులో సంజూకు స్థానం దక్కినప్పటికీ ఒక్క మ్యాచ్ ఆడలేకపోయాడు. రిషభ్ పంత్ ఫామ్‌లో ఉండటంతో సంజూ రిజర్వ్ బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది.

మరో రెండేళ్లలో మళ్లీ పొట్టి కప్ జరగనుంది. ప్రస్తుతం సంజూ వయసు 29. వచ్చే ప్రపంచ కప్ (2026) నాటికి అతడు 31 ఏళ్లకు చేరతాడు. అప్పటికి యువ క్రికెటర్ల నుంచి తీవ్ర పోటీ ఎదురు కానుంది. శాంసన్ తుది జట్టులో ఉండాలని భావిస్తే.. ఇప్పటి కంటే ఇంకా దూకుడుగా ఆడితేనే అవకాశం లభిస్తుందని మిశ్రా వ్యాఖ్యానించాడు.

"సంజూ శాంసన్ నాణ్యమైన క్రికెటర్ అనడంలో సందేహం లేదు. అయితే, ప్రపంచ కప్ 2026లో (%20 ఔశీతీశ్రీ‌స జబజూ% 2026) కచ్చితంగా ఆడతాడని చెప్పలేను. కుర్రాళ్ల నుంచి తీవ్ర పోటీ ఎదుర్కోక తప్పదు. యువ క్రికెటర్లకు అవకాశం కోసమని సీనియర్లు రోహిత్, విరాట్, రవీంద్ర జడేజా ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. ఇప్పుడు సీనియర్‌గా సంజూ శాంసన్ జట్టులో నిలదొక్కుకోవడానికి మంచి ఛాన్స్ ఉంది. రాబోయే సిరీసుల్లో అత్యుత్తమ ప్రదర్శన చేస్తేనే తదుపరి వరల్డ్ కప్ కోసం పరిగణనలోకి తీసుకొంటారు. దాదాపు రెండేళ్లపాటు




ఇదే స్థాయిలో ఆటతీరు ఉండాలి. సంజూ కంటే రిషభ్ పంత్, ఇషాన్ కిషన్, కేఎల్ రాహుల్‌తోపాటు కొత్తకుర్రాళ్లు పోటీలో ఉన్నారు. టీ20 అంటేనే యువకుల ఆట అనే మైండ్‌సెట్ అభిమానుల్లో ఉంది. అదే సమయంలో సీనియారిటీ కూడా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని ఇప్పటికే నిరూపణ అయింది. సంజూ దూకుడుగా ఆడటంతోపాటు జట్టు అవసరాలకు తగ్గట్టుగా ఎక్కడి నుంచైనా బరిలోకి దిగేలా సిద్ధంగా ఉండాలి" అని మిశ్రా తెలిపాడు.


# వెస్టిండీస్‌తో రెండోటెస్ట్‌కు ఇంగ్లండ్ రెడీ

### ఇంగ్లండ్ బౌలింగ్ మెంటార్‌గా అండర్సన్

లార్డ్స్: వెస్టిండీస్‌లో ట్రెంట్‌బ్రిడ్జ్ వేదికగా రెండో టెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు సిద్ధమైంది. తొలిటెస్ట్‌లో వెస్టిండీస్‌పై ఇన్నింగ్స్ 114పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన ఇంగ్లండ్ జట్టు రెండో టెస్ట్ బరిలోకి దిగుతోంది. మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు 1-0 ఆధిక్యతలో ఉండగా.. 2012 తర్వాత ఇంగ్లండ్ క్రికెట్ జట్టు టెస్టుల్లో స్టువర్ట బ్రాడ్, అండర్సన్ లేకుండా బరిలోకి దిగడం ఇదే తొలిసారి. మరోవైపు వెస్టిండీస్ టెస్టుల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. ఆ జట్టు అన్ని విభాగాల్లోనూ రాణిస్తేనే ఇంగ్లండ్‌కు గట్టి పోటీ ఇవ్వనుంది.

బౌలింగ్ మెంటార్‌గా ఆండర్సన్..

మాజీ పేసర్ జేమ్స్ అండర్సన్ మళ్లీ జాతీయ జట్టుతో చేరాడు. 41ఏళ్ల అండర్సన్ వెస్టిండీస్‌తో గురువారం నుంచి లార్డ్స్ వేదికగా జరిగే రెండో టెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు మెంటార్‌గా ఎంపికయ్యాడు. వెస్టిండీస్‌తో తొలి టెస్టు ముగిసిన తర్వాత అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు



పలికిన సంగతి తెలిసిందే. అయితే రిటైర్మెంట్ ప్రకటించిన మూడు రోజులకే మళ్లీ జాతీయ జట్టుకు సేవలందించనున్నాడు. రెండో టెస్టుకు ఇంగ్లండ్ మార్క్‌వుడ్‌ను తుది జట్టులోకి తీసుకుంది.

# లైన్‌లోకి వచ్చిన కోహ్లీ.. రియాన్ పరాగ్‌కు బంపర్ ఆఫర్..!

శ్రీలంకతో వచ్చే నెలలో జరగనున్న వన్డే సిరీస్‌కు తాము అందుబాటులో ఉంటామని సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)కి తెలియజేసినట్లు సమాచారం.

వచ్చే ఏడాది జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆడాలనుకునే సీనియర్ ఆటగాళ్లు ఖచ్చితంగా శ్రీలంకతో వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండాలని కొత్త కోచ్‌గా బాధ్యతలు స్వీకరించనున్న గంభీర్ చేసిన అభ్యర్థనకు సీనియర్ ఆటగాళ్లు స్పందించినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది. ఛాంపియన్ ట్రోఫీకి ముందు భారత జట్టు కేవలం రెండు వన్డే సిరీస్‌లు మాత్రమే ఆడనుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే లంకతో మూడు వన్డేలతో పాటు ఇంగ్లాండ్‌తో మూడు వన్డేలు మాత్రమే ఆడనుంది. ఈ క్రమంలో ఈ వన్డే మ్యాచుల్లో ఖచ్చితంగా సీనియర్ ఆటగాళ్లు ఆడాలని గంభీర్ సూచించాడు. తొలుత లంక పర్యటన వెళ్లొందని, విశ్రాంతి తీసుకోవాలని రోహిత్, కోహ్లీ భావించారు. అయితే గంభీర్ అభ్యర్థన మేరకు వీరిద్దరు మనసు మార్చుకున్నట్లుగా అర్థమవుతోంది. కాగా.. ఈ పర్యటనకు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది. సెప్టెంబర్ నుంచి టెస్టు సీజన్ ఆరంభం కానుండడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇక హార్దిక్ పాండ్యా టీ20 సిరీస్‌కు మాత్రమే అందుబాటులో ఉండనున్నాడు. వ్యక్తిగత కారణాలతో వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండనని ఇప్పటికే బీసీసీఐకి హార్దిక్ సమాచారం ఇచ్చాడు.

జూలై 27 నుంచి టీ20 సిరీస్, ఆగస్టు 2 నుంచి వన్డే సిరీస్ ఆరంభం కానున్నాయి. లంక పర్యటనకు సంబంధించి భారత జట్లను బీసీసీఐ ఒకటి లేదా రెండు రోజుల్లో ప్రకటించనుంది. వన్డేల్లో కెప్టెన్‌గా రోహిత్ శర్మనే వ్యవహరించనుండగా, టీ20ల్లో మాత్రం సూర్యకుమార్‌కు బాధ్యతలు అప్పగించనున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. యువ ప్లేయర్ రియాన్ పరాగ్ టీ20లు, వన్డేలకు ఎంపిక కానున్నట్లుగా తెలుస్తోంది. అలాగే రోడ్డు ప్రమాదం కారణంగా 20 నెలలు వన్డేలకు దూరమైన పంత్ వన్డేల్లో లంక పర్యటనతో రీ ఎంట్రీ ఇవ్వనున్నాడు.

# ఏకలవ్య కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

పెద్దపల్లి : ఏకలవ్య కార్పోరేషన్ ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధిని విడుదల చేయాలని ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు రేవెల్లి తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికంగా బుధవారం ఏకలవ్య జయంతి వేడుకలు తెలంగాణ ప్రజా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, జిల్లా కేంద్రంలో ట్రైబల్ కార్యాలయం ఏర్పాటుచేసి ఎరుకల సభ్యులకు రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. ఎరుకల జాతి అభ్యున్నతికి ఏకలవ్యుని బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మానుపాటి శ్రీనివాస్, ఏకలవ్య సేవా సమితి జిల్లా అధ్యక్షులు మానుపాటి రవి, దాసరి కిష్టయ్య, లోకిని మల్లేష్, రేవెల్లి శీనయ్య, మానుపాటి సంపత్, వెంకటేష్,సార్ల సాయిలు,ట్యాంక్ జయదేవ్,తదితరులు పాల్గొన్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**